ఆదివారం
26-11-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 154
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కుల్తీ రైల్వేస్టేషన్‌లో మంటలు

అసన్‌సోల్: రైలు ప్రమాదాలు, రైళ్లల్లో మంటలు ఇటీవల తరుచూ సంభవిస్తున్నాయి. ఈ క్రమంలోనే శనివారం పశ్చిమ బెంగాల్‌లో మరో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి అసన్ సోల్ జిల్లాలోని కుల్తీ రైల్వేస్టేషన్ తగలబడిపోయింది. రైల్వే స్టేషన్ లోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి సైతం మంటలకు కూలిపోయింది. స్టేషన్ లోని ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. మంటలతో అప్రమత్తం అయిన రైల్వే స్టేషన్ అధికారులు, సిబ్బంది వెంటనే రైల్వేలైన్ విద్యుత్ నిలిపివేశారు. ఆ తర్వాత ఫ్లాట్ ఫాంపై ఉన్న ప్రయాణికులను బయటకు పంపించేశారు. నాలుగు అగ్నిప్రమాద యంత్రాలు మంటలను అదుపు చేశాయి.

క్యాంపు రాజకీయం

- ఉత్తరాంధ్ర అభివృద్ధి బూచి
- కార్యాలయాల ఏర్పాటు దేనికి సంకేతం ?
- ప్రజలతో సీఎం మైండ్ గేమ్
- అధికార యంత్రాంగం అవస్థలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి ముసుగులో దొడ్డిదారిన రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాల తరలింపు దేనికి సంకేతం? విశాఖలో క్యాంపు కార్యాలయాల పేరుతో సీఎం జగన్ రాజకీయాలు చేస్తున్నారు. ఎన్నికల ముందు సీఎంకు ఉత్తరాంధ్ర అభివృద్ధి గుర్తుకు వచ్చిందా? సమీక్షలతోనే అక్కడి అభివృద్ధి ముందుకెళ్తుందా? అంటూ మేధావులు ప్రశ్నిస్తున్నారు. క్యాంపు కార్యాలయాల తరలింపుతో అభివృద్ధి ఎలా సాధ్యమని నిలదీస్తున్నారు. ఇదంతా రాబోయే ఎన్నికల్లో వైసీపీ లబ్ధి కోసమేనని, రాష్ట్ర ప్రజలతో సీఎం మైండ్ గేమ్ ఆడుతున్నారని మండిపడుతున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సమూల మార్పులు తీసుకురావడాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. మూడు రాజధానుల వ్యూహం ఫలించలేదనే అక్కసుతో సీఎం పంతం కోసం క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు అవుతోంది. రెండు, మూడు నెలల్లో ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు వస్తాయి. చివరి దశలో ప్రభుత్వ శాఖల కార్యాలయాల ఏర్పాటుకు నిర్ణయించడంపై అనేక అనుమానాలు ఉన్నాయి. ఎన్నికలు వచ్చేలోగా సీఎం ఎన్ని సమీక్షలు నిర్వహిస్తారు? దానివల్ల ఉత్తరాంధ్రకు ఎంత మేలు జరుగుతుందనేది

- మిగతా 2 లో

బీజేపీ పతనం ఖాయం

- మోదీని గద్దె దించడానికి ప్రజలు సిద్ధం
- ఎన్‌డీఏ అసమర్థ పాలనతో దేశం వెనక్కి
- అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, మిత్రపక్షాల విజయం తథ్యం: డి.రాజా
- ఇసుక, మద్యం పాలసీల్లో భారీ దోపిడీ: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలో దాదాపు పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న విధానాలతో విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీని సాగనంపటానికి సిద్ధంగా ఉన్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు విజయం సాధిస్తాయని దీమా వ్యక్తంచేశారు. ఈ ఫలితాల ప్రభావం 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిబింబిస్తుందని తెలిపారు. విజయవాడ దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోదీ పాలనను రాజా ఎండగట్టారు. మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కారణంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని రాజా తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయని, ప్రజల మధ్య విద్వేషాలు, అసమానతలు పెచ్చరిల్లేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మైనార్టీలు అభద్రతా భావంతో ఉన్నారని, ప్రజలు ఏమి తినాలో, ఏ బట్టలు కట్టుకోవాలో నిర్దేశిస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు ఐక్యంగా పోరాడి బీజేపీని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా దేశాన్ని, రాజ్యాంగాన్ని, లౌకికతత్వాన్ని కాపాడుకోగలమని అభిప్రాయపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తరువాత ఇండియా కూటమి బలమైన రాజకీయ శక్తిగా మారబోతుందన్నారు. 3వ సారి అధికారం కట్టబెడితే ప్రపంచంలో 3వ ఆర్థిక శక్తిగా భారత్ అవతరిస్తుందని మోదీ పదేపదే చెప్పుకోవడాన్ని ఆయన నిరసించారు. అబద్ధాలు ప్రచారం చేస్తున్న మోదీ...దేశాన్ని ఆర్థికంగా వెనక్కునెట్టారని ఆరోపించారు. నౌకాశ్రయాలు, విమానాశ్రయాలతో పాటు ఇతర సంపదను అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్ శక్తులు, వ్యాపార దిగ్గజాలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మోదీ అధికారం చేపట్టిన తర్వాత నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల బతుకులు దుర్భరమయ్యాయన్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత దిగజారిందన్నారు. ఆకలి సూచీకి సంబంధించి 120 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉందన్నారు. దేశంలో ఏ వర్గం ప్రజలు ఆనందంగా లేరని, గిట్టుబాటు ధరలు లేక రైతులు, ఉద్యోగాలు లేక యువత అల్లాడుతున్నారన్నారు. నూతన జాతీయ విధానంపై విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కరువైందని, ప్రజల మధ్య అంతరాలు సృష్టించే మనువాదాన్ని తీసుకువచ్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. 'బీజేపీ హఠావో- దేశ్ బచావ్' నినాదంతో మోదీ ప్రజాకంతక పాలనపై ప్రజలను చైతన్యవంతం చేయడంలో సీపీఐ ముందంజలో ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత ఇండియా కూటమి చర్చించి దేశవ్యాప్తంగా మోదీకి వ్యతిరేకంగా ఐక్యపోరాటాలు చేసేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. రాజ్యాంగాన్ని, లౌకికతత్వాన్ని కాపాడుకోవటం కోసం లౌకిక, ప్రజాతంత్రశక్తులు కలిసి రావాలని రాజా కోరారు.

రాజకీయ పార్టీలు సైద్ధాంతికంగా నిర్ణయాలు తీసుకుంటాయని, అందువల్ల మధ్యప్రదేశ్‌లో ఆమ్‌ఆద్మీ పార్టీ ఒంటరిగా పోటీ చేసిందని ఓ ప్రశ్నకు సమాధానంగా రాజా చెప్పారు. రాజకీయ పరిస్థితులు ఒక్కో రాష్ట్రంలో ఒక్కోరకంగా ఉంటాయని తెలంగాణలో సీపీఎం ఒంటరిగా పోటీ చేయటాన్ని ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో లౌకిక పార్టీలు ఐక్యపోరాటాలకు కలిసి రావాలని కోరారు. చంద్రబాబు అరెస్టు వెనుక ఎవరు ఉన్నారో త్వరలోనే తెలుస్తుందన్నారు. జమిలీ ఎన్నికల విధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టంచేశారు. జమిలీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన కమిటీకి చైర్మన్‌గా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు తీసుకోవటం ఆయన వ్యక్తిగతమన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ముఖ్యమైన అంశాలపై చర్చలు లేకుండా దాటవేయటం, బిల్లులు ఆమోదం కోసం జమిలీ ఎన్నికల అంశాన్ని మోదీ ప్రభుత్వం తెరపైకి తెచ్చిందని విమర్శించారు. విదేశీ వ్యవహారాల్లో భారతదేశం మొదటి నుంచి అనుసరిస్తున్న విధానానికి విరుద్ధంగా ఇజ్రాయిల్‌కు మోదీ సర్కారు మద్దతివ్వటం సరికాదన్నారు. నాటో దళాలు ఇజ్రాయిల్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ పలస్తీనాపై దాడి చేస్తున్నాయని మండిపడ్డారు. పలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధానికి స్వస్తి పలకాల్సిన అవసరాన్ని రాజా నొక్కి చెప్పారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో దొంగల రాజ్యం

- మిగతా 2 లో

ఆరు గ్యారెంటీలు కావు
ఆరు చట్టాలు

- కేసీఆర్‌కు మోదీకి తేడాలేదు
- నా ఇల్లు ప్రజల మనస్సులోనే ఉంది
- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే తాము ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఆరు చట్టాలుగా మార్చి ప్రజలకు అందిస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కచ్చితంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే కర్నాటకలో ప్రకటించిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, అయితే కొంతమంది తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు గ్యారెంటీ పథకాలు అమలు కావడం లేదని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ప్రచారాలను ప్రజలు నమ్మకుండా కాంగ్రెస్‌ను గెలిపించాలని రాహుల్ పిలుపునిచ్చారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నిజామాబాద్‌లోని బోధన్, అదిలాబాద్, వేములవాడలో నిర్వహించిన బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ధ్వజమెత్తారు. అక్కడ నరేంద్ర మోదీ, ఇక్కడ కేసీఆర్‌కు పెద్ద తేడా ఏమీ లేదన్నారు. అక్కడ ఆయన తన మిత్రుల కోసం దేశ సంపదను దోచిపెడుతుంటే, ఇక్కడ కేసీఆర్ తన కుటుంబం కోసం రాష్ట్ర సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి కుటుంబ పాలనను తరిమికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. కాళేశ్వరం పేరుతో పెద్దఎత్తున కుంభకోణం జరిగిన విషయం అందరికీ తెలుసని, స్వయంగా కేంద్ర మంత్రులు కూడా ఈ విషయాన్ని అనేక సందర్భాల్లో మాట్లాడినా ఇక్కడ ఈడీ, ఐటీ ఎలాంటి పని చేయవని ఎద్దేవా చేశారు. కనీసం అవినీతిపై విచారణ

- మిగతా 2 లో

కేసీఆర్ కుటుంబం చేతిలో
తెలంగాణ బందీ

- హామీలు అమలు చేయని ముఖ్యమంత్రి
- కామారెడ్డి, రంగారెడ్డి సభల్లో ప్రధాని మోదీ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన తెలంగాణ ప్రజలు ఇపుడు మరోసారి బీఆర్ఎస్ పాలన నుండి విముక్తి కావాలని కోరుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. అనేక ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణ... ఒక కుటుంబం చేతిలో బందీగా మారి విలవిలలాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనను ప్రజలు తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కామారెడ్డి, రంగారెడ్డిలో నిర్వహించిన బహిరంగసభల్లో ప్రసంగించారు. బీఆర్ఎస్‌పై మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అనేక వర్గాల ప్రజలు ఉద్యమించి

- మిగతా 2 లో

వైద్య విద్య వ్యాపారీకరణ కోసమే

ఎన్‌ఎంసీ నోటీసు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్

న్యూఢిల్లీ: నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) ఇటీవల జారీ చేసిన బహిరంగ నోటీసును వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. 2024 నుంచి నీట్-యూజీకి సంబంధించి అర్హతలో ఎన్ఎంసీ కీలక మార్పులు చేసింది. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విక్కీ మహేసరి, ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగ రాజ్ శనివారం ఓ ప్రకటన చేశారు. నీట్ యూజీ పరీక్షలకు హాజరు కావడానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన బోర్డుల నుంచి సైన్స్ యేతర సబ్జెక్టుల విద్యార్థులతో పాటు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, బయోటెక్నాలజీ సబ్జెక్టుల విద్యార్థులు 12వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని ఎన్ఎంసీ స్పష్టంచేసింది. జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా ఎన్ఎంసీ ఈ నిర్ణయం తీసుకుంది. వైద్య విద్య, వృత్తికి సంబంధించి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, బయోటెక్నాలజీ ప్రాథమిక సబ్జెక్టులు. ఎంబీబీఎస్ అనేది వృత్తి విద్యాకోర్సు. లాబోరేటరీ ప్రయోగాలతో పాటు ఈ సబ్జెక్టులను తప్పనిసరిగా బోధిస్తారు. వైద్య విద్యకు ఈ సబ్జెక్టులు అత్యవసరం. పరీక్షల కోసమే కొన్ని అదనపు సబ్జెక్టులు ఉంటాయి. నాణ్యమైన విద్య కోసం వాటిని బోధిస్తారు. ఎన్ఎంసీ నిర్ణయం విద్యార్థులను ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల వైపు పరుగులు తీసేలా కనిపిస్తోంది. వైద్య విద్యకు సంబంధించి ఇప్పటికే ఉన్న ప్రైవేట్ ఎంట్రన్స్ కోచింగ్ సెంటర్లు ప్రమాదకరంగా పరిణమించాయి. విద్యార్థులపై ఆర్థికభారం పడటమే కాకుండా విద్యాపరంగా ఒత్తిడి తీవ్రమవుతోంది. వైద్య విద్యను పూర్తిగా వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ చేయడమే ఎన్ఎంసీ తాజా నోటీసు లక్ష్యంగా కనిపిస్తోంది. వైద్య విద్య కోర్సుల నాణ్యతను తక్కువ చేసే ప్రయత్నం వల్ల దేశంలో ఆరోగ్యరంగం పూర్తిగా దెబ్బతింటుంది. భారత పౌరుల భవిష్యత్తు, వారి ఆరోగ్య భద్రతతో ఎన్ఎంసీ రాజీపడుతోంది. జాతీయ విద్యావిధానం నిబంధనల ఆధారంగానే ఎన్ఎంసీ నోటీసు విడుదల చేసింది. జాతీయ విద్యావిధానం వల్ల విద్యారంగం సర్వనాశనమవుతోంది. మోదీ సర్కారు తీసుకొచ్చిన ఈ విధానమే సరైనది కాదు. అందుకే ఎన్ఎంసీ జారీ చేసిన నోటీసును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి డిమాండ్ చేస్తోంది. విద్యార్థులు, సాధారణ ప్రజల ఉత్తమ భవిష్యత్ కోసం జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు విక్కీ మహేసరి, దినేశ్ సీరంగ రాజ్ ఆ ప్రకటనలో స్పష్టంచేశారు.

ఇదీ లోకం!

ప్రమాదానికి వారిద్దరే కారణం

- మద్యం మత్తులో పక్కబోటులోకి సిగరెట్ విసిరేశారు
- ఫిషింగ్ హార్బర్ ప్రమాదంపై సీపీ రవిశంకర్

2లో

రాజస్తాన్‌లో 68 శాతం ఓటింగ్ 8లో

అడుగడుగునా అడ్డంకులే...

- విరిగిపోయిన ఆగర్ యంత్రం
- సొరంగంలో మానవశక్తితో డ్రిల్లింగ్‌కు ఆలోచన
- టన్నెల్ నిపుణుడు ఆర్నాల్డ్ డిక్స్

ఉత్తరకాశీ : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని సిల్క్యారా సొరంగంలో చిక్కుకుపోయిన 41 మంది కార్మికులను రక్షించేందుకు ఆపరేషన్ కొనసాగిస్తున్నప్పటికీ ఏదో ఒక అవాంతరం ఏర్పడుతూనే ఉంది. గత 13 రోజులుగా సహాయక ఆపరేషన్ కొనసాగుతోంది. ఇప్పటికే రక్షణ బృందాలు బాధితులను బయటికి తెచ్చేందుకు అనేక రకాలుగా ప్రయత్నించి విఫలమయ్యాయి. మరో ప్రయత్నంగా సొరంగం పై నుంచి డ్రిల్ వేసి బాధితులను బయటికి తీసేందుకు యత్నించారు. కానీ మధ్యలో గట్టి బండరాయి తగలడంతో ఆ ప్రయత్నం కూడా విఫలమైంది. ఇంకో ప్రయత్నంగా కూలిన శిథిలాల నుంచే సొరంగం లోపలికి డ్రిల్ వేసేందుకు యత్నించారు. కానీ శనివారం డ్రిల్ మిషన్ బ్లేడ్‌లు సొరంగం శిథిలాల్లో ఇరుక్కుపోవడంతో ఆ ప్రయత్నం కూడా విఫలమైంది. కాగా, సొరంగానికి డ్రిల్ వేయడం

- మిగతా 2 లో

ఇది ప్రారంభం మాత్రమే

ఇజ్రాల్-హమాస్ సంధిపై బైడెన్

వాషింగ్టన్: ఇజ్రాయెల్-హమాస్ మధ్య గత నెల నుంచి జరుగుతోన్న భీకరపోరుకు కాల్పుల విరమణ రూపంలో తాత్కాలిక విరామం లభించి 24వ తేదీ ఉదయం నుంచి రెండువర్గాల మధ్య సంధి ప్రారంభమై హమాస్ చెరలో ఉన్న 24 మంది బందీలు విడుదలకావడం ఆరంభం మాత్రమేనని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. గాజాలో ఈ తాత్కాలిక విరామాన్ని పొడిగించేందుకు అవకాశాలున్నాయని చెప్పారు. పశ్చిమాసియాలో రెండు వర్గాల మధ్య ఈ రావణకాష్ఠం సమసిపోవాలంటే సార్వభౌమాధికారం కలిగిన స్వతంత్రదేశంగా పలస్తీనాను ప్రకటించాలనే వాదనను అనేక దేశాలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో శాంతి నెలకొల్పేందుకు ఈ పరిష్కారంపై పనిచేయడానికి ఇది తగిన సమయమని బైడెన్ అన్నారు. సంధి మొదలైన తీరును ఆయన స్వాగతించారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, ఇప్పటివరకు బాగానే జరిగిందన్నారు. శుక్రవారం అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా విడుదలైన 24 మందిలో 13 మంది ఇజ్రాయెలీలు, 10 మంది థాయ్ జాతీయులు, ఒక ఫిలిప్పీన్ దేశస్థుడు ఉన్నారు. అదే సమయంలో ఇజ్రాయిల్ కూడా 39 మంది పలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. ఒప్పందంలో భాగంగా నాలుగు రోజుల్లో హమాస్ 50 మంది బందీలను, అందుకు బదులుగా ఇజ్రాయిల్ 150 మంది పలస్తీనా ఖైదీలను విడిచిపెట్టాల్సి ఉంది.

జపాన్‌ను వణికిస్తున్న బర్డ్ ఫ్లూ

మొదటి కేసు గుర్తింపు

టోక్యో: అత్యంత వ్యాధికారక -రకం బర్డ్ ఫ్లూ జపాన్‌ను వణికిస్తోంది. మొదటి కేసును జపాన్ లోని ఒక పౌల్ట్రీ ఫారమ్‌లో గుర్తించినట్టు పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కే శనివారం తెలిపింది. సాగా ప్రిఫెక్చర్‌లోని స్థానిక ప్రభుత్వం పొలంలో సుమారు 40,000 పక్షులను చంపనున్నదని వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులను ఉటంకిస్తూ ఎన్‌హెచ్‌కే తెలిపింది. దీనిపై వ్యాఖ్యానించడానికి మంత్రిత్వ శాఖ అధికారులు అందుబాటులో లేరని పేర్కొంది. వైరస్ వ్యాప్తిని నిరోధించే చర్యల గురించి చర్చించేందుకు ప్రధాన మంత్రి ఫుమియో కిషిడా సంబంధిత క్యాబినెట్ మంత్రులను సమావేశపరుస్తారని ఎన్‌హెచ్‌కే తెలిపింది. శుక్రవారం ఫామ్‌లో కొన్ని పౌల్ట్రీ పక్షులు చనిపోయినట్లు గుర్తించిన తరువాత నిర్వహించిన జన్యు పరీక్ష ఫలితంగా వైరస్ కనుగొన్నారని ఆ నివేదిక తెలిపింది. ఇటీవలి సంవత్సరాలలో అత్యంత వ్యాధికారక ఏవియన్ ఇన్ఫ్లుఎంజా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి, కోట్లాది పక్షులను చంపడానికి దారితీసింది. జపాన్‌లో గత సీజన్‌లో రికార్డు స్థాయిలో 17.7 మిలియన్ పౌల్ట్రీ పక్షులను చంపివేశారని, దీనిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ఐర్లాండ్ రాజధానిలో హింస

కత్తి పోట్లు, భారీ విధ్వంసం

ప్రధాని దిగ్భ్రాంతి

డబ్లిన్ సిటీ: ఐర్లాండ్ రాజధాని డబ్లిన్ సిటీ సెంటర్‌లో తీవ్ర హింసచెలరేగింది. గురువారం రాత్రి చోటుచేసుకున్న కత్తి పోట్ల ఘటన తీవ్ర అల్లర్లు , భారీ విధ్వంసానికి దారి తీసింది. పాఠశాల వద్ద ఒక వ్యక్తి పొడవాటి కత్తితో విద్యార్థులపై విరుచుకుపడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు, మహిళ (స్కూల్ కేర్ అసిస్టెంట్)కు తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన అనంతరం సెంట్రల్ డబ్లిన్ అంతటా హింసాత్మక నిరసన చెలరేగింది. ఈ ఘటన తరువాత దేశంలో మరింత అల్లర్లు చెలరేగే అవకాశం ఉందని ఐర్లాండ్ పోలీసు చీఫ్ హెచ్చరించారు. శుక్రవారం నాటికి రాజధాని ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ ప్రశాంతంగా ఉందని పోలీసులు ప్రకటించారు. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 34 మందిని అరెస్టు చేశారు. తీవ్ర ఆగ్రహావేశాలతో పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చిన నిరసన కారులు బీభత్సం సృష్టించారు. 11 పోలీసు వాహనాలను ధ్వంసం చేయగా, 13 దుకాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పోలీసులతో జరిగిన ఘర్షణలో మరిన్ని దుకాణాలను దుండగులు లూటీ చేశారు. మూడు గంటలకు పైగా జరిగిన అల్లర్లలో మూడు బస్సులు, ఒక రైలు(ట్రామ్)ను తగుల బెట్టారు. అనేక మంది పోలీసు అధికారులు కూడా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇలాంటి హింస గతంలో ఎన్నడూ చూడలేదని ఐరిష్ పోలీసు కమిషనర్ డ్రూ హారిస్ వ్యాఖ్యానించారు. మరోవైపు డబ్లిన్ తగులబడిపోతున్నట్టుగా అనిపించిందంటూ స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

కత్తిపోట్ల ఘటనపై ఐర్లాండ్ ప్రధాని లియో వరాద్కర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాదాపు 500 మంది అల్లర్లలో పాల్గొన్నారని , వీరంతా జాతికే అవమానం తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై కఠిన చర్యలు తీసుకునేందుకు త్వరలోనే కొత్తచట్టాలను తీసుకురానున్నట్టు తెలిపారు. 50 ఏళ్ల ఐరిష్ పౌరుడిని నిందితుడిగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్నాడు. నిరాయుధులను చేసి, పోలీసులు వచ్చే వరకు అతన్ని నేలపై పిన్ చేశారు. అతను ఆసుపత్రిలో కాపలాగా చికిత్స పొందుతున్నాడు. ఈ దాడికి కారణాలు తెలియరాలేదు.

ఆరు దేశాలకు చైనా ఉచిత వీసా

బీజింగ్: ఇటీవల కాలంలో వివిధ దేశాలు ఉచిత వీసా అవకాశాన్ని కల్పిస్తున్నాయి. తాజాగా చైనా శుక్రవారం ఆరు దేశాలకు ఉచిత వీసా అవకాశం కల్పించింది. అందులో అయిదు ఐరోపా దేశాలతో పాటు మలేసియా ఉన్నాయి. వ్యాపార, పర్యాటక రంగాల్లో ఆయా దేశాలకు చెందిన పౌరులను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. డిసెంబరు ఒకటో తేదీ నుంచి 15 రోజుల పాటు ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్పెయిన్, మలేసియా దేశాలకు ఈ అవకాశం కల్పించింది. కొవిడ్ నేపథ్యంలో గత మూడేళ్లుగా చైనా పర్యాటకులకు అనుమతులు నిలిపేసింది. ఈ ఏడాది నిబంధనలు తొలగించింది. ఈ నేపథ్యంలో గడిచిన ఆరునెలల్లో 84 లక్షల మంది విదేశీయులు ఆ దేశంలో పర్యటించారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన చర్యలేవి ?

ఎంప్లాయీస్ యూనియన్ ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ పీటీడీ(ఆర్టీసీ)ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీవీ నరసయ్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కావలి ఘటన మరువక ముందే రాయచోటి/తిరుపతి డిపోల సిబ్బందిపై దాడులు జరిగాయని వివరించారు. నిత్యం ప్రజలతో కలసి విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బందిపై జరుగుతున్న దాడులపై పోలీసులు శ్రద్ధగా వ్యవహరించి, దాడులు చేసిన వారిపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఈ దాడులను అరికట్టడం కష్టమవుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించేలా, దాడులుచేసిన వారిపై కేసు నమోదు చేసిన వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు పంపించేలా ఆర్టీసీ యాజమాన్యం చొరవ తీసుకోవాలన్నారు. నిరంతరం ఆర్టీసి బస్సులలో ప్రజల మధ్య విధులు నిర్వహిస్తున్న పీటీడీ సిబ్బందిపై రోజు రోజుకూ దాడులు పెరుగుతున్నాయని, దీనిపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. కావలి ఘటనలో దాడికి గురైన డ్రైవర్ రామ్ సింగ్ ఇప్పటికీ విజయవాడ ఆర్టీసీ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నప్పటికీ, అక్కడ నయం కానందున మెరుగైన చికిత్స కోసం, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సహకారంతో కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారని తెలిపారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బంది ఆత్మ స్థయిర్యంతో విధులు నిర్వహించాలంటే, ఇలాంటి దాడులు చేస్తున్న వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు పోలీసులు తలవంచకుండా అరెస్టు చేసి రిమాండ్ కు తిరలించాలని డిమాండ్ చేశారు.

ప్రమాదానికి వారిద్దరే కారణం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం కీలక మలుపు తిరిగింది. ఈ ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులను పోలీసులు గుర్తించారు. ఓవైపు ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్ కోసం ప్రజలంతా టీవీలకు అతుక్కుపోయి ఉండగా మరోవైపు విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఊహించని ప్రమాదం అందర్నీ కలవరపాటుకు గురి చేసింది. మంటలు చెలరేగి క్షణాల్లో బోట్లు కాలి బూడిదయ్యాయి. విశాఖలో ఇంత భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం అధికారులను, పోలీస్ యంత్రాంగాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు, క్లూస్ టీమ్ ప్రమాదానికి గల కారణాలను అన్వేషించి మీడియా ముందుకు వచ్చారు. హార్బర్‌లో అగ్ని ప్రమాదంపై విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అయ్యర్ శనివారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు. ఈ కేసులో వాసుపల్లి నాని, అతడి మామ సత్యం ప్రధాన నిందితులుగా గుర్తించినట్లు చెప్పారు. నిందితులు మద్యం మత్తులో సిగరెట్లు పక్కబోటులోకి విసిరేశారని ఆయన వివరించారు. బోటు ఇంజిన్‌పై సిగరెట్ పడటంతోనే ప్రమాదం జరిగిందన్నారు. నైలాన్ వలల వల్ల ప్రమాద తీవ్రత పెరిగిందని సీపీ రవిశంకర్ చెప్పారు. ఈ అగ్నిప్రమాదంలో 30 బోట్లు కాలిపోయాయన్నారు. వాసుపల్లి నాని, అతని మామ సత్యమే ఈ అగ్నిప్రమాదానికి అసలు కారణమన్నారు. 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు వీరిద్దరూ మద్యం తాగడానికి హార్బర్‌కు వచ్చారని, అల్లిపల్లి వెంకటేశ్‌కు చెందిన 887 నెంబర్ బోటులో మద్యం తాగి ఫిష్ ఫ్రై చేసుకున్నారన్నారు. సిగరెట్ తాగి పక్కనే ఉన్న 815 నెంబర్ బోటుపై పడేశారని, దీంతో మెల్లమెల్లగా మంటలు చెలరేగి బాగా వ్యాపించాయని, దీనిని గమనించి వారిద్దరూ అక్కడి నుంచి జారుకున్నారని సీపీ తెలిపారు. వాసుపల్లి నాని బోట్లలో కుక్‌గా, సత్యం వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారన్నారు. వారిద్దరిపై ఐపీసీ సెక్షన్ 437, 438, 285 ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా చాలామంది అనుమానితులను విచారించామని, అందులో ముగ్గురు నానీలు ఉన్నారన్నారు. విచారణలో భాగంగా యూట్యూబర్ నానిని కూడా విచారణ చేశామన్నారు. అతని ప్రమేయం లేదని తేలితే తామే విడిచి పెట్టే వాళ్లమన్నారు. ఈలోపు యూట్యూబర్ నాని హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి 47కు పైగా సీసీ కెమెరాలు పరిశీలించామన్నారు. ఈ ఘటనలో మొత్తం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని సీపీ రవి శంకర్ అయ్యన్నార్ తెలిపారు. వలలకు నిప్పు అంటుకున్న తర్వాత మొదట పొగలు వచ్చాయని, ఆ సమయంలో గాలులు కూడా వీయడంతో మంటలు త్వరగా వ్యాపించాయన్నారు. విచారణలో నిందితులు నేరం అంగీకరించారన్నారు. ఈ ప్రమాదంలో 30 బోట్లు పూర్తిగా దగ్ధం కాగా, 18 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని చెప్పారు. 8 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కమాండ్ కంట్రోల్ ద్వారా హార్బర్‌ను పరిశీలిస్తామని సీపీ వెల్లడించారు.

ఆరు గ్యారెంటీలు కావు ఆరు చట్టాలు

(మొదటిపేజీ తరువాయి)

జరిపించే సాహసం కూడా కేంద్ర ప్రభుత్వం చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంతసేపూ కేంద్రంలో బీజేపీకి కేసీఆర్ మద్దతు ఇవ్వడం, ఇక్కడ బీఆర్ఎస్‌కు మోదీ మద్దతు ఇచ్చుకుంటూ వారి తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్రం తీసుకువచ్చిన ప్రతి చట్టానికి కేసీఆర్ సహకరించారనే మాట వాస్తవం కాదా అని నిలదీశారు. ఇక్కడ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ బీఆర్ఎస్ నాయకులకు వరంగా మారిందని, చాలా మంది బీఆర్ఎస్ నాయకులు భూ యజమానులుగా మారిపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ కారు పంక్చర్ అయ్యిందని, వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకు అక్కడి ప్రభుత్వం తన పార్లమెంటు సభ్యత్వం రద్దు చేసిందని, చివరకు నాకు ఉన్న ప్రభుత్వ నివాసాన్ని కూడా లాక్కున్నారని విమర్శించారు. కానీ తన ఇల్లు ప్రజల మనస్సులో ఉందనే విషయాన్ని వారు గ్రహించలేకపోయారని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో దొరలకు, ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. పేదల కోసం కాంగ్రెస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే పేదల భూములు లాక్కోవడం ఖాయమన్నారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి గురించి పదే పదే కేసీఆర్ సహా పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారని, కానీ వారి పార్టీ అధినేత కేసీఆర్ చదువుకున్న పాఠశాల కాంగ్రెస్ పార్టీ కట్టిందే అని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని ఐటీ నగరం చేసింది కూడా కాంగ్రెస్ అని, మెట్రో కాంగ్రెస్ హయాంలోనే వచ్చిందన్నారు. కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు అనుభవిస్తున్న పదవులు కూడా నాడు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇవ్వడం వల్లనే వచ్చిందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్న మంత్రులందరూ దోపిడీ దారులని, లిక్కర్ మాఫియా, భూదందా కేసీఆర్ కుటుంబంలో ఉందని దుయ్యబట్టారు. గతంలో గిరిజనులకు పోడు భూములను పంచి వారికి హక్కులను కల్పిస్తే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారి భూములను అక్రమంగా లాక్కున్నారని ఆరోపించారు. దళితబంధు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని అన్నారు. బీఆర్ఎస్‌పై, కేసీఆర్ మీద విమర్శలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు కేసీఆర్ మీద ఇప్పటి వరకు ఒక్క కేసు పెట్టలేదనే విషయాని ప్రజలందరూ ఆలోచించాలన్నారు. కేసీఆర్, బీజేపీని తరిమికొట్టాలని కేంద్రంలో బీజేపీని, మోదీని ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తెలంగాణ బందీ

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణను సాధించుకున్నారని చెప్పారు. నాడు ఏ ఆకాంక్షలతో పోరాటం చేశారో వాటిని నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేసీఆర్‌కు కుటుంబం తప్ప ప్రజలు పట్టడం లేదని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌కు హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేసే చిత్తశుద్ధి లేదన్నారు. అనేక హామీలు ఇచ్చిన కేసీఆర్ వాటిలో చాలా వరకు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి సంక్షేమ పథకంలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఆ పార్టీకి ఏటీఎంలా మారాయన్నారు. కమీషన్ల కోసమే ప్రాజెక్టులను ఇష్టానుసారం నిర్మించారని, ఇపుడు వాటి మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో వేల కోట్ల ప్రజాధనం నిరుపయోగంగా మారే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీజేపీ బీఆర్ఎస్ మాదిరిగా కాదని, తాము హామీ ఇస్తే అమలు చేసి తీరుతామన్నారు. కామారెడ్డి ప్రజలు సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పే గొప్ప అవకాశం దక్కిందని, ఈ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించి చరిత్ర సృష్టించాలన్నారు. టీఆర్ఎస్ హఠాత్తుగా బీఆర్ఎస్‌గా ఎందుకు మారిందో ఆలోచించాలన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, అందుకే ఇక్కడి ప్రజలు బీఆర్ఎస్ నుంచి విముక్తి కోరుకుంటున్నారన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ విధానాలు ఉన్నాయని, తాను ఇచ్చే మాటలే మీకు గ్యారంటీ అంటూ వ్యాఖ్యానించారు. దేశానికి బీసీని ప్రధాని చేసింది బీజేపీ అని, తెలంగాణకు బీసీని ముఖ్యమంత్రిగా చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టడానికి బీజేపీ చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజాధనమంతా కేసీఆర్ కుటుంబ సభ్యుల జేబుల్లోకి వెళ్లిందన్నారు. బీజేపీ మేనిఫెస్టోలో అనేక అంశాలు పొందుపరిచామని, వాటిని అమలు చేసేందుకు బీజేపీ కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి : మల్లికార్జున ఖడ్గే

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తన స్వార్థం కోసం మిగులు బడ్జెట్‌తో వున్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖడ్గే అన్నారు. తెలంగాణకు 5లక్షల 70వేల కోట్ల అప్పు మిగిల్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పేరుతో అప్పులను తీసుకువచ్చి వాటిని వివిధ సంక్షేమ పథకాల పేరుతో పక్కదారి పట్టించారని విమర్శించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి సంక్షేమ పథకంలో భారీగా అవినీతి చోటుచేసుకుందన్నారు. కల్వకుర్తిలో శనివారం నిర్వహించిన విజయభేరీ సభలో ఖడ్గే ప్రసంగిస్తూ, ప్రస్తుతం రాష్ట్రంలో కేసీఆర్ ప్రతి ఒక్కొరిపై లక్షా40 వేల అప్పు మోపారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని ఏర్పాటు చేసి తీరుతామన్నారు. ఇందిరమ్మను, సోనియమ్మను, రాహుల్ గాంధీని కేసీఆర్ విమర్శిస్తున్నారు కాని దేశంలో పేదరికాన్ని నిర్మూలించిన ఘనత ఇందిరమ్మదనేసన్న విషయాన్ని అయన గుర్తుపెట్టుకుంటే మంచిదన్నారు. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు సంక్షేమం అందిందని, ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు మేలు జరుగుతుందనే విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. కాని నేడు కొంతమంది అజ్ఞానులు ఇందిరాగాంధీని విమర్శించడం విడ్డురంగా వుందన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేము ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. చేయూత పథకం ద్వారా అర్హులైన అందరికీ రూ.4వేలు పెన్షన్ అందిస్తామని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు పేదలకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ప్రతీ ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు రుణమాఫీ, రైతుబంధు వంటి కార్యక్రమాలను చేపడతామన్నారు. కేసీఆర్, మోదీలా మేం బూటకపు హామీలు ఇవ్వమని స్పష్టం చేశారు. ఇప్పటికే కర్ణాటకలో ఆ హామీలని కూడా అమలు అవుతున్నాయని కావాలనే ఇక్కడి బీఆర్ఎస్ నాయకులు దాని పై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఉచ్చిత విద్యుత్ విషయంలో కూడా ఎలాంటి సందేహపడాల్సిన లేదని రైతులకు 24గంటల ఉచ్చిత విద్యుత్‌ను అందించి తీరుతామన్నారు.

బీజేపీ పతనం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

నడుస్తోందన్నారు. ఇసుక, మద్యం పాలసీల్లో పెద్దఎత్తున దోపిడీ జరుగుతున్నదన్నారు. గత ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇచ్చినందువల్ల ప్రభుత్వానికి నష్టం వచ్చిందన్న సాకుతో సీఐడీ కేసు నమోదు చేసిందని గుర్తుచేశారు. వైసీపీ నాయకుడు అనిల్‌రెడ్డికి ఇసుక అక్రమాలతో సంబంధాలున్నాయని ఆరోపించారు. జేపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో యధేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నట్లు చెప్పారు. జలాశయాల్లో నీరు లేకపోవడంతో పెద్దఎత్తున ఇసుక తవ్వేందుకు వైసీపీ ప్రభుత్వానికి అవకాశం ఏర్పడిందన్నారు. రకరకాల బ్రాండ్‌ల పేరుతో నాసిరకం మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. బేవరేజెస్ కార్పొరేషన్‌కు నగదు రూపంలో వస్తున్న ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు పంపిస్తున్నారని చెప్పారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని హైకోర్టు చెప్పటంతో సీఎం జగన్ సుప్రీంకోర్టుకు వెళ్లారని, సుప్రీంకోర్టు తీర్పు వచ్చే వరకు ఆగకుండా విశాఖకు రాజధాన్ని తరలించటం ఏమిటని నిలదీశారు. రిషికొండపై భవనాలు నిర్మించటం కోసం రూ.450 కోట్లు ఖర్చు చేశారని, అందులో రూ.150 కోట్లు అవినీతి జరిగిందన్నారు. పేదవారి పక్షాన పోరాడుతున్నట్లు ప్రచారం చేసుకునే జగన్‌మోహన్‌రెడ్డి టాయిలెట్ నిర్మాణానికి రూ.25 లక్షలు ఖర్చు చేయటం ఏమిటని ప్రశ్నించారు. రిషికొండను తొలిచి పర్యావరణానికి తూట్లు పొడిచారని ఆరోపించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ కోసం అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేయాలన్నారు. దొంగ ఓట్ల చేర్పింపుపై ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితా అవకతవకలపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు.

క్యాంపు రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నార్థకం. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం నిమగ్నమైంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల(ఈవీఎం)ను జిల్లాల వారీ తరలింపునకు ప్రణాళిక రూపొందించింది. ఫిబ్రవరి చివరికిగానీ, మార్చి మొదటి వారంలో గానీ ఎన్నికల షెడ్యూలు వస్తుంది. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీకి అంత చిత్తశుద్ధి ఉంటే నాలుగున్నరేళ్లలోనే రాష్ట్ర విభజన హామీల సాధనపై దృష్టి పెడితే బాగుండేది. వైసీపీకి అత్యధికంగా ఎంపీలున్నప్పటికీ కేంద్రంపై ఒత్తిడి చేయలేకపోయింది. పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును మోదీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తుంటే...వైసీపీ ఎంపీలు అడ్డుకోలేకపోయారు. పార్లమెంట్‌లో ఏనాడూ పోరాడిన సందర్భం లేదు. రైల్వేజోన్ అంశంలోనూ అన్యాయం జరిగినా మౌనంగా ఉండిపోయారు. విశాఖకు వచ్చిన అనేక కేంద్ర విద్యాసంస్థలకు నిధులు రాలేదు. ప్రభుత్వ ఆస్తులను, భూములను అడ్డగోలుగా అదానికి కట్టబెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇవన్నీ ప్రభుత్వం మరచి ఉత్తరాంధ్ర అభివృద్ధి ముసుగులో విశాఖలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటుకు నిర్ణయించడం అర్థరహితం. మూడు రాజధానుల ప్రస్తావన లేకుండా ప్రజల్ని మభ్యపెట్టేందుకు దొడ్డిదారిన క్యాంపు కార్యాలయాలను విశాఖ తరలిస్తున్నట్లు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

అధికారులకు అసౌకర్యం

విశాఖలో అనేక ప్రభుత్వ శాఖల రాష్ట్రస్థాయి క్యాంపు కార్యాలయాల ఏర్పాటు వల్ల ఉన్నతాధికారుల నుంచి సిబ్బంది వరకు ఆందోళన మొదలైంది. సీఎం నిర్ణయంతో అధికారులు అసౌకర్యానికి గురవుతారు. కొద్ది రోజులపాటు ఆయా శాఖల ఉన్నతాధికారులంతా ఏర్పాట్లలో నిమగ్నం కావాల్సి ఉంటుంది. వారికి తోడుగా సహచర సిబ్బంది అవసరం. ప్రభుత్వం ఆలోచన ప్రకారం మంత్రులు, అధికారులు ఉత్తరాంధ్రకు వెళ్లినప్పుడు అక్కడ క్యాంపు కార్యాలయంలో బస చేస్తారని చెబుతోంది. వెలగపూడి సచివాలయం నుంచి ఉన్నతాధికారులతోపాటు విశాఖకు సమాచారం అందించేందుకు సంబంధిత విభాగాల సిబ్బంది వెళ్లాలి. వారికి వసతి సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. దీనివల్ల అదనపు ఆర్థికభారం పెరుగుతుంది. వెలగపూడిలోని సచివాలయ ఉద్యోగులు ఇంకా హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వారి కోసం వారానికి ఐదు రోజులే పనిదినాలు కల్పించారు. ఉద్యోగుల కుటుంబాలు హైదరాబాద్‌లోనే స్థిరపడ్డాయి. పిల్లల చదువులు పూర్తి కాలేదు. ఏపీ సచివాలయానికి దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో బృందాల వారీగా ఇళ్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. మరికొందరు కుటుంబ సమేతంగా వచ్చి విజయవాడ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పేరుకే ఇవి క్యాంపు కార్యాలయాలు అయినప్పటికీ, త్వరలో తమను కూడా విశాఖకు పంపుతారన్న ఆందోళనలో సచివాలయ ఉద్యోగులున్నారు. విద్యా సంవత్సరం చివరి దశలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వంపై అదనపు భారం

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. ప్రతినెలా అప్పుల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందడం లేదు. విశాఖ కేంద్రంగా ఆశించిన స్థాయిలో పరిశ్రమలు రాలేదు. దీంతో ఉద్యోగ, ఉపాధి కల్పన దూరమైంది. నిరుద్యోగ యువత, కూలీలు వలస పోతున్నారు. విశాఖలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటుతో ప్రభుత్వంపై మరింత ఆర్థిక భారం పెరగనుంది. రాష్ట్ర ప్రజల శ్రేయస్సును మరచి సీఎం జగన్ కేవలం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంపై సొంత పార్టీ నేతల్లోనే వ్యతిరేకత నెలకొంది. సీఎం జగన్ ఆశించిన మూడు రాజధానుల నిర్ణయానికి న్యాయస్థానాల్లో అడ్డంకులు ఉన్నాయి. అనేకసార్లు విశాఖకు ప్రభుత్వ శాఖలను తరలించేందుకు ప్రయత్నించి విఫలమైంది. సీఎం క్యాంపు కార్యాలయం విశాఖకు వెళ్లిపోతుందంటూ ప్రచారం చేసి, వెనక్కితగ్గారు. విశాఖ కేంద్రంగా భూ దందాలు కొనసాగుతున్నాయని, వైసీపీ నేతల దారుణాలు మితిమీరాయని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. ఇదంతా కేవలం ఉత్తరాంధ్ర తదితర ప్రాంతాల్లో వైసీపీ నేతల సొంత లబ్ధి కోసమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు అతి తక్కువ వ్యవధిలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటుతో వైసీపీ రాజకీయం చేస్తోందని, ప్రజాధనం దుర్వినియోగమవుతోందని మండిపడుతున్నారు.

అడుగడుగునా అడ్డంకులే...

(మొదటిపేజీ తరువాయి)

సమస్య కాదని, అయితే దాని లోపల ఉన్న బాధితులకు ఎలాంటి హాని జరగకుండా బయటికి తీసుకురావడమే కష్టసాధ్యంగా మారిందని అంతర్జాతీయ టన్నెలింగ్ నిపుణుడు ఆర్నాల్డ్ డిక్స్ శనివారం అన్నారు. మానవీయంగా సొరంగాన్ని తవ్వడమే ఇక ఆఖరి మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. అందుకు దాదాపు నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని డిక్స్ చెప్పారు. ఆగర్ యంత్రం విరిగిపోవడంతో చిక్కుకున్న 41 మంది కార్మికులను బయటకు తీసుకురావడానికి నిలువు, మానవీయ డ్రిల్లింగ్‌తో సహా ఇతర ఎంపికలను పరిశీలిస్తున్నామన్నారు. 'ఆగర్ యంత్రం విరిగిపోయింది. చిక్కుకున్న వారిని రక్షించే మార్గాన్ని సిద్ధం చేయడానికి శిథిలాల గుండా డ్రిల్లింగ్ చేస్తున్నప్పుడు ఆగర్ యంత్రం గత కొన్ని రోజులుగా పదేపదే అడ్డంకులను ఎదుర్కొంది. ఈ పరిస్థితుల్లో నిలువుగా తవ్వడం లేదా మానవశక్తితో తవ్వడం వంటి ఇతర ఎంపికల గురించి అడిగినప్పుడు, అన్ని ఎంపికలను అన్వేషిస్తున్నట్లు డిక్స్ చెప్పారు. 'మేము తెరవడానికి ప్రయత్నిస్తున్న ప్రతి తలుపు దాని ప్రయోజనాలు, అప్రయోజనాలు కలిగి ఉంటుంది. మేము పర్వతంతో వ్యవహరించబోతున్నాము. అది మనకు ఏ తలుపులు తెరవబోతోందో మాకు తెలియదు. సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాము' అని అన్నారు. చిక్కుకున్న వ్యక్తులు, రక్షించేవారి భద్రతను నిర్ధారించడం ఆపరేషన్‌లో నిమగ్నమై ఉన్న బహుళ సంస్థల లక్ష్యం అని ఆయన చెప్పారు. 'పర్వతం ఇప్పటికీ అస్థిరంగా ఉంది. మేము ఒక పతనాన్ని కలిగి ఉన్నాము. పరుగెత్తడం వల్ల మరిన్ని సమస్యలు తలెత్తవచ్చు' అని తెలిపారు. తన కుమార్తె కూడా మైనర్ అని, తన హృదయం చిక్కుకున్న కార్మికులతో ఉందని టన్నెలింగ్ నిపుణుడు చెప్పారు. నవంబరు 12న ఉత్తరాఖండ్‌లోని చార్ ధామ్ మార్గంలో నిర్మాణంలో ఉన్న సిల్క్యారా సొరంగంలో కొంత భాగం కొండచరియలు విరిగిపడి, లోపల ఉన్న 41 మంది కార్మికులు చిక్కుకున్నప్పుడు బహుళ సంస్థల సహాయక చర్యల ప్రయత్నం ప్రారంభమైంది. శుక్రవారం డ్రిల్లింగ్‌కు కొద్దిసేపటి ముందు, 46.8 మీటర్ల 800-మి.మీ-వెడల్పు ఉక్కు పైపును డ్రిల్ చేసిన మార్గంలోకి నెట్టారు. కూలిపోయిన ప్రాంతం దాదాపు 60 మీటర్ల పొడవు ఉంటుందని అంచనా. కార్మికులకు ఆహారం, ఇతర అవసరమైన వస్తువులను సరఫరా చేయడానికి ఆరు అంగుళాల వెడల్పు గల ట్యూబ్ 57 మీటర్లు ప్రయాణించింది. శిథిలాల గుండా స్టీల్ పైపులు వేయడానికి ఆగర్ యంత్రం క్షితిజ సమాంతర డ్రిల్లింగ్ చేయకుండా ఒకదాని తర్వాత మరొకటి అడ్డుకోవడంతో మిగిలిన 10 నుంచి 12 మీటర్ల వరకు మానవశక్తితో తవ్వే ఎంపికను పరిశీలిస్తున్నట్లు అధికారి తెలిపారు. అయితే మానవ శక్తితో తవ్వడానికి ఎక్కువ సమయం పడుతుందని అన్నారు. అలాగే నిలువునా తవ్వి మార్గం కల్పించడం ద్వారా కార్మికులను రక్షించే ప్రయత్నం కూడా జరుగుతుందన్నారు. శనివారం ఉదయం ఒక పెద్ద డ్రిల్లింగ్ యంత్రాన్ని సొరంగం పైన ఉన్న కొండ వైపు తరలించారు. ఇక్కడ నిలువు డ్రిల్లింగ్ కోసం నిపుణులు రెండు తక్కువ ఎత్తులో ఉన్న ప్రదేశాలను గుర్తించారు. సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్‌వో) ద్వారా సొరంగం పైభాగానికి 1.5-కిమీ మేర రహదారిని నిర్మించారు. ఎందుకంటే నిలువు డ్రిల్లింగ్ చేయాలని కొంతకాలంగా భావిస్తున్నారు. నిలువునా తవ్వడం అనేది ఎక్కువ సమయం తీసుకునే, సంక్లిష్టమైన ఎంపిక అని, ఇది సొరంగం పైకప్పు పైన ఇరుకైన స్థలం కారణంగా మరింత కచ్చితమైన జాగ్రత్త అవసరం అని డిక్స్ కొన్ని రోజుల క్రితం చెప్పారు. సహాయక ఆపరేషన్‌కు పదేపదే అడ్డంకులు రావడంతో చిక్కుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు క్రమంగా సహనం కోల్పోతున్నట్లు కనిపించింది. 'గత రెండు రోజులుగా వారిని (చిక్కుకున్న కార్మికులు) త్వరలో రక్షిస్తామని అధికారులు మాకు హామీ ఇస్తున్నారు. కానీ ఏదో ఒకటి జరుగుతుంది. ప్రక్రియ ఆలస్యం అవుతుంది' అని బీహార్‌లోని బంకా నుంచి దేవేందర్ కిస్కు చెప్పారు. అతని సోదరుడు వీరేందర్ కిస్కు సొరంగంలో చిక్కుకున్నాడు. సొరంగంలో రెండు కిలోమీటర్ల మేర నిర్మించిన పనుల్లో కార్మికులు ఉన్నారు. ఆరు అంగుళాల పైపు ద్వారా వారికి ఆహారం, మందులు, ఇతర నిత్యావసర వస్తువులు పంపుతున్నారు. వాకీటాకీల ద్వారా వారి బంధువులు, వైద్యులతో మాట్లాడుతున్నారు.

విశాలాంధ్ర

3

ఆదివారం
26 నవంబరు 2023

మోదీ క్షమాపణ చెప్పాలి

శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని, హామీలు అమలు చేస్తానని, గుజరాత్‌కన్నా అభివృద్ధి చేస్తానని వెంకటేశ్వరస్వామి సాక్షిగా తొమ్మిదేళ్ల క్రితం వాగ్దానం చేసిన మోదీ మాట తప్పారని, దీనిపై వెంకన్న సాక్షిగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం విజయవాడ ఎంబీవీకేలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కమిటీలో వివిధ తీర్మానాలు చేసినట్లు చెప్పారు. బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ అంతర్జాతీయ హిందూమహాసభ పెట్టి తమది హిందూయిజం కాదని, హిందుత్వమని ప్రకటించినట్లు తెలిపారు. హిందూమతం అన్నా, హిందువులన్నా వారికి గౌరవం లేదన్నారు. హిందువుల్లో అగ్రవర్ణ సంపన్నులు అదానీ, అంబానీలాంటి వారి ఆధిపత్యం సాధించడమే ఆరెస్సెస్, బీజేపీ ప్రాధాన్యతని తెలిపారు. హిందువుల పేరుతో దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. తిరుపతిలో ప్రధానిని సీఎం జగన్ విభజన హామీలపై నిలదీయాలని కోరారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు వస్తుందని, మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని అంటున్నారని, ఇది ఎందుకో చెప్పాలన్నారు. పవన్‌ను జనసైనికులు ప్రశ్నించాలన్నారు. హోదా పాచిపోయిన లడ్డు అన్న పవన్ ఇప్పుడు వాటిని తీసుకొచ్చి వెంకన్న కాళ్లదగ్గర పెట్టి క్షమాపణ కోరాలన్నారు. ప్రశ్నించడానికి పుట్టామని చెప్పిన ఆయన మోదీని ప్రశ్నిస్తారో లేదో ప్రజలకు చెప్పాలన్నారు. మోదీ, జగన్ కలిసి రాష్ట్రాన్ని అదానీకి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు, సోలార్ ఒప్పందం ఇందులో భాగమేనన్నారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించాలని, అర్హులైన అసైన్డ్ లబ్ధిదారులకే హక్కులు కల్పించాలని తీర్మానించినట్లు తెలిపారు.

మూడు నెలల కోసం ప్రజాధనం వృథా చేస్తారా

గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలోని వైఎస్ జగన్ ప్రభుత్వానికి మూడు నెలలే గడువు ఉందనీ, అలాంటప్పుడు జగన్ ప్రభుత్వానికి విశాఖకు ఎందుకు వస్తున్నారో చెప్పాలని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ట్విట్టర్ (ఎక్స్) వేదిక ప్రశ్నించారు. "అయ్యా జగన్ గారు.. విశాఖ ఎందుకొస్తున్నారు... దేనికోసం వస్తున్నారు. ఇలా అడ్డదారిలో రావాల్సిన అవసరం ఏమొచ్చిందో సమాధానం చెప్పండి.....? ప్రశాంత నగరంగా పేరున్న విశాఖ మీ రాజధాని ప్రకటనతో అరాచకాలకు అడ్డాగా మారింది. పులివెందుల పంచాయితీలు నడుస్తున్నాయి. ఎప్పుడూ మీ స్వార్థం, మీ రాజకీయ లబ్ధి తప్ప.. మా విశాఖ ప్రజల మనోవేదన మీకు పట్టడంలేదు. ఈ మూడు నెలల ముచ్చట కోసం వేల కోట్ల ప్రజా ధనాన్ని తగలేస్తున్నారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే విశాఖ రాజధానిపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టండి నూటికి 99 శాతం మంది ప్రజలు రాజధాని వద్దనే చెబుతారు. ఎన్నికలకు మూడు నెలల ముందు విశాఖ వచ్చి ఏమి సాధిద్దాం అనుకుంటున్నారు. రాజధాని అమరావతేనని, అక్కడి నుంచి ప్రభుత్వ కార్యాలయాల్ని తరలించవద్దని హైకోర్టు స్పష్టంగా తీర్పు చెప్పినా అడ్డదారిన ఈ తరలింపు ఎవరికోసం. ఆ ఆదేశాలు అమల్లో ఉండగానే దొడ్డిదారిన జీవో ఇవ్వడం కోర్టుధిక్కారం కాదా....?" అంటూ గంటా శ్రీనివాసరావు ట్వీట్ చేశారు.

మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

- 27, 28 తేదీల్లో విజయవాడలో మహాధర్నాను విజయవంతం చేయండి
- రైతు, కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకుల పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా గవర్నర్ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఈనెల 27, 28 తేదీలలో విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు, కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, శ్రామిక ప్రజలందరూ పాల్గొని మోదీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలన్నారు. రైతు, కార్మిక సంఘాల ఐక్య వేదిక సంఘాల సమన్వయ సమితి అధ్వర్యంలో శనివారం విజయవాడలోని కందుకూరి కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అసమాన త్యాగాల వలన సిద్ధించిన స్వాతంత్ర్య ఫలితాలు దేశ ప్రజలందరికీ అందేందుకు, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, పత్రికా స్వాతంత్ర్యంతో సహా భారత పౌరులందరికీ హామీ ఇవ్వబడిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, ఆదేశిక సూత్రాలలో నిర్దేశించబడిన విధంగా దేశంలోనే భౌతిక వనరులు, సంపద ప్రజలందరికీ చెందాలన్నారు. దేశంలో కొద్దిమంది కోటేశ్వర్ల వద్దే సంపద కేంద్రీకృతమైందని విమర్శించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుంటూ కుల, మత, వర్గ విద్వేషాలు లేకుండా లౌకిక వ్యవస్థను బలపర్చుకోవాలన్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ రైతులు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, మైనార్టీలు, దళితులు, షెడ్యూల్ తెగల వారితో సహా అందరూ తమ సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి, సంక్షేమం కోసం అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా యువతీయువకులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. దేశభక్తి ముసుగులో దేశద్రోహులకు దేశ సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీకి కారుచౌకకు కట్టబెడుతున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. లాభాలతో ఉన్న ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను అమ్మటం తగదన్నారు. అనేక పోరాటాలు, 32 మంది బలిదానాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం దానిని అడ్డుకోవడానికి ప్రయత్నించకుండా వత్తాసు పలుకుందని విమర్శించారు. పోర్టుల దగ్గర నుంచి అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను అదానీకే కట్టబెడుతోందన్నారు. రాష్ట్రంలో కరువు ఏర్పడి రైతులు, వ్యవసాయ కూలీలు అనేక అవస్థలు పడుతుంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. నదీ జలాలు వృధాగా సముద్రం పాలవుతున్నా పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చెయ్యకుండా, జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ చారిత్రక రైతు పోరాటం సందర్భంగా అమరులైన రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ ఉపసంహరించాలని, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను, అతని కుమారుడు అశీష్ మిశ్రాను విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు మహాధర్నాకు కదలి రావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ బీజేపీ కబంధహస్తాల నుంచి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను కాపాడుకోవడం కోసం దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలోకి రావాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘం అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ ఆదివాసీల భూములను ఇతరులకు కట్టబెట్టరాదని, ఆదివాసీల భూముల నుంచి వారిని తొలగించరాదని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక హక్కులను పునరుద్ధరించాలని, పని ప్రదేశంలో సమానత్వాన్ని, భద్రతను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు పి.జమలయ్య, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, కుర్రా నరేంద్ర, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, నాయకులు ఎం.సుబ్బారావు, ఎం.హరిబాబు, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, కె.ధనలక్ష్మి, దడాల సుబ్బారావు, వి.కృష్ణయ్య, ఎం.రామకృష్ణ, ఎ.రవిచంద్ర, ఎస్ విజయ్, గోగినేని ధనశేఖర్, లంకా గోవింద రాజులు, ఎం.సాబశివరావు, రంగనాయకులు, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాలు ప్రకటించాలి

దేగా ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర -ఏలూరు: వర్షాభావ పరిస్థితుల వలన పంటలు నష్టపోయిన మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి, యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు మండలాలు ప్రకటించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధి వర్గం డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేసింది. అనంతరం రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేగా ప్రభాకర్, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాలలో 470 మండలాలలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు కేవలం 32.8 శాతం తక్కువ వర్షపాతం నమోదయిందన్నారు. ఈ కారణంగా ఖరీఫ్ పంటలో సాధారణ విస్తీర్ణం తగ్గే ప్రమాదం ఉందన్నారు. 21 జిల్లాలలో కేవలం 25 శాతం భూముల్లో మాత్రమే రైతాంగం పంటలు వేశారని, ఏలూరు జిల్లాలో ఖరీఫ్ లో వేసిన ఆహార, ఉద్యాన, వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. డెల్టా ప్రాంతంలో నీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని, దీనివలన పూర్తిస్థాయిలో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతుందని, తాగునీటి ఎద్దడి రాబోతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి

రామచంద్రయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఈ నెల 27,28తేదీలలో విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిసూ ఈ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతుల పట్ల ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడానికి మూడు నల్లచట్టాలను తెచ్చి రైతుల భూములను, పంటలను కార్పొరేట్‌కు కట్టపెట్టెందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ మహాధర్నాలో కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రామచంద్రయ్య కోరారు.

మహాధర్నాకు చేతివృత్తిదారుల సమాఖ్య మద్దతు

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు సంఘాల సమన్వయ సమితి, కేంద్ర కార్మిక సంఘాల వేదిక అధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడలో జరిగే మహాధర్నా కార్యక్రమానికి చేతివృత్తిదారుల సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనేక మోసపూరిత మాటలు చెప్పి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాటాలతో, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను పెట్టి కార్మిక హక్కులను కాల రాసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కంపెనీలకు అప్పగించి బడా పెట్టుబడుదారులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. దేశ కార్మిక వర్గాన్ని, ప్రశ్నించే గొంతుకలపై తప్పుడు కేసులుపెట్టి దేశద్రోహుల పేరుతో కేసులు పెట్టి నిర్బంధిస్తూ భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందన్నారు. రైతుల భూములు, పంటలను తిరిగి కార్పొరేట్‌ల దోపిడీకి అప్పగించేందుకు దొడ్డి దారిలో చట్టాలను తీసుకొని రావాలని ప్రయత్నిస్తోందని తెలిపారు. కార్మిక వర్గం, రైతాంగానికి సహాయంగా ఉన్న గ్రామీణ చేతి వృత్తి దారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ పోరాటంలో చేతి వృత్తి దారులు పాల్గొంటారని తెలిపారు.

ఏవోబీ ఘాట్ రోడ్డు వద్ద టిప్పర్ బోల్తా

ఆరుగురి మృతి, మరో ఏడుగురికి గాయాలు



విశాలాంధ్ర-సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా సమీపంలోని హంతలగుడ ఘాట్ రోడ్డు వద్ద టిప్పర్ లారీ బోల్తా పడిన దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. ఒడిశాలోని చిత్రకొండ నుంచి జడంబోకు శనివారం మధ్యాహ్నం సిమెంట్ లోడుతో వస్తున్న టిప్పర్ ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని హంతల్‌గుడ ఘాట్ రోడ్డు వద్ద అదుపుతప్పి బోల్తా పడినట్టు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను మల్కంగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే... టిప్పర్ లారీలో డ్రైవర్‌తో సహా 13 మంది కార్మికులు ఉన్నారు. జోడ ఎంరాణా వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు పనులకు జంటపాయి గోడౌన్ నుంచి సిమెంట్ వస్తోంది. జంటపాయి నుంచి స్టేషన్‌కు వెళుతుండగా సిమెంట్, ఇనుప రాడ్‌లతో కూడిన టిప్పర్ బోల్తా పడి 20 అడుగుల మేర కిందకు పడిపోయింది. దీంతో టిప్పర్‌లోని కార్మికులపై సిమెంట్, ఇనుప రాడ్‌లు పడ్డాయి. ఈ ప్రమా దంలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్‌తో సహా 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే రక్షించేం దుకు యత్నించారు. అయితే సమీపంలోని బీఎస్ఎఫ్ బలగాలు సమా చారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను ప్రథమ చికిత్స నిమిత్తం సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చనిపోయిన ఐదుగురు కార్మికులలో ఇద్దరిని నబరంగ్‌పూర్ జిల్లా కొసగుముడ బ్లాక్‌కు చెందినవారిగా గుర్తించారు. స్థానిక తహసీల్దార్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అధికారి, జోధ్‌పూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను చిత్రకొండలోలో శవపరీక్షకు తరలించారు. చికిత్స పొందుతున్న 8 మంది కార్మికులలో ఒకరు చిత్రకొండ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతూ మరణించారు. దీంతో మృతుల సంఖ్య ఆరుగురికి చేరింది. గాయపడిన ఏడుగురిని మలకంగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎంపీ రమేష్ మాఝీ చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి, నష్టపరిహారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని మృతుల కుటుంబాలకు హామీ ఇచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విశాలాంధ్ర సాహిత్య కృషి అమోఘం

విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ రాఘవేంద్రరావు



విశాలాంధ్ర - విశాఖ: ఎన్నో మంచి రచనలను ప్రచురించడం ద్వారా విశాలాంధ్ర ప్రచురణాలయం సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు విశేష కృషి చేస్తోందని విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ విశాఖ 22వ పుస్తక మహోత్సవాన్ని స్థానిక టర్నర్ సత్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడులతో వస్తున్న సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తోందని చెప్పారు. ఠాగూర్, ప్రేమ్ చంద్ తదితర ప్రముఖ రచయితల సాహిత్యాన్ని ప్రజలకు పరిచయం చేసిందన్నారు విలువలతో కూడిన సాహిత్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో విశాలాంధ్ర ప్రచురణాలయం ఎప్పుడూ అగ్రస్థానంలో నిలబడుతోందని చెప్పారు. మరుగున పడిన ఎన్నో రచనలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఏటా పుస్తక మహోత్సవాలను నిర్వహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖలో ఈ ఏడాది విశాఖ పుస్తక మహోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రయత్నించామని తెలిపారు అందులో భాగంగా పుస్తక విక్రేతలను, రచయితలను, విద్యాసంస్థలను సంప్రదించామని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించాలని భావించామని, అయితే కొన్ని ఇబ్బం దుల వల్ల దీన్ని ఏర్పాటు చేయలేకపోయామని అన్నారు. విశాఖ పుస్తక మహోత్సవం కొన్నాళ్లపాటు జరిగి ఆగి పోయిందన్నారు. అప్పటినుంచీ విశాలాంధ్ర బుక్ హౌస్ ఏటా అన్ని రంగాల సాహిత్యాన్ని ప్రజలకు అందు బాటులో ఉంచేందుకు పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. టీవీ, కంప్యూటర్, సెల్ ఫోన్.. ఎన్ని అందుబాటులోకి వచ్చిన పుస్తకానికి అవేవీ ప్రత్యామ్నాయం కాదని అన్నారు. విశాఖ భిన్న సంస్కృతులకు నిలయమని అనేక విద్యాసంస్థలు ఉన్నాయని చెప్పారు. అభ్యుదయ సాహిత్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు విశాలాంధ్ర ప్రచురణాలయం చేస్తున్న కృషి ప్రశంసనీయమని చెప్పారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు మాట్లాడుతూ విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవాన్ని సాహిత్య అభిమానులు, రచయితలు, విద్యార్థులు సందర్శించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రచయిత ఆచార్య డి.సూర్యారావు మాట్లాడుతూ మనిషికి జ్ఞానాన్ని ప్రసాదించే వారధిగా విశాలాంధ్ర ప్రచురణాలయం నిలిచిందని ప్రశంసించారు. అన్ని రంగాల, భిన్న భావజాలాల పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారన్నారు. సమాజంలో రచయితల సంఖ్య పెరుగుతుండగా పాఠకుల సంఖ్య తగ్గుతుండడానికి ఇంటర్నెట్ కొంతవరకు కారణమని అన్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పుస్తక మహోత్సవాలకు ప్రభుత్వం ఉచితంగా స్థలం కేటాయించాలని కోరారు. గ్రంథాలయాలను ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పుస్తకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌర సమాజంపై ఉందని అన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ విశాలాంధ్రతో తనకు చాలా అనుబంధం ఉందన్నారు. సాహిత్యం అంటే సమాజమని చెప్పారు. గతకాలం నాటి పుస్తకాలను చదవడమంటే అప్పటి సమాజం గురించి తెలుసుకోవడమేనని అన్నారు. హిమాంశు బుక్ డిపో ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయడంలో విశాలాంధ్ర చేస్తున్న కృషిని అభినందించారు. నగరంలో ఇలాంటి ప్రదర్శనలు మరెన్నో రావాలని ఆకాక్షించారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ప్రతి రోజూ వివిధ రకాల సాహిత్య కార్యక్రమాల నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పీవీ రాజు, సిబ్బంది మూర్తి, అనీల్, అనేక మంది రచయితలు పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక సంగం డెయిరీ

ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

విశాలాంధ్ర-గుంటూరు: సంగం డెయిరీ పాడి రైతుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, రైతులచే, రైతుల కోసం, రైతుల భాగస్వామ్యంతో నడిచే సంస్థ సంగం డెయిరీ అని దాని ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. గుంటూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం వేదికగా సజ్జల రామకృష్ణారెడ్డి దర్శకత్వంలో మళ్లీ తప్పుడు కేసులు పెట్టే కుట్రకు తెరలేపారని ఆరోపించారు. ఛైర్మన్‌గా ఉన్న తనను, సీనియర్ జీఎం ప్రసాద్‌ను, సంగం డెయిరీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టర్లను ఉద్దేశపూర్వకంగా అక్రమంగా అరెస్ట్ చేసే ప్రయత్నం చేశారన్నారు. డెయిరీ ప్రతిష్టను దెబ్బతీయాలన్న లక్ష్యంలో భాగంగానే కుట్ర చేస్తున్నారన్నారు. సంగం డెయిరీలో ధర నిర్ణయించినా, బోనస్ ఇచ్చినా విధానపరమైన నిర్ణయాలతో నడుస్తుందని, డెయిరీకి వ్యక్తులతో ఒప్పందం ఉండబోదన్నారు. ఒప్పందం విషయాన్ని పోలీసు అధికారులకు వివరించామన్నారు. ద్వారకామయి డెయిరీతో జరిగిన ఒప్పందంలో ముద్దాయి రాము లేదని కోర్టులోనూ స్పష్టం చేశామని, మహాలక్ష్మి, కిషోర్ అనే వ్యక్తులు ద్వారకామయి డెయిరీలో జాయింట్ ఎకౌంట్ ఆపరేట్ చేస్తున్నారని న్యాయస్థానానికి వివరాలు అందజేశామన్నారు. మాట్లాడటానికి వస్తే నలుగురు వస్తారా, నలభై మంది కిరాయి మూకలను వెంటేసుకు వస్తారా అంటూ నరేంద్ర ప్రశ్నించారు. పాడి రైతుల ముసుగులో సంగం డెయిరీ ముందు విధ్వంసం సృష్టించడానికి కొంతమంది పక్క జిల్లా నుంచి వస్తే వారికి వత్తాసు ఎవరు పలికారో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. డెయిరీ ముందు ఎలాంటి సంఘటనలు జరగకపోయినా కేసులు ఎలా పెడతారని నరేంద్ర ప్రశ్నించారు. పోలీసు వెబ్‌సైట్‌లో ఎఫ్ఐఆర్, కోర్టుకు ఇచ్చిన ఎఫ్ఐఆర్‌లో తేడాలు ఉన్నట్లు స్పష్టమౌతుందని, ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు తనతో పాటు డెయిరీ అసిస్టెంట్ మేనేజర్ పేర్లను 14, 15 ముద్దాయిలుగా చేర్చారని ఆరోపించారు. తమ పేర్లు పెట్టమని స్థానిక ఎమ్మెల్యే, సజ్జల ఆదేశాల మేరకు ఐజీని కలిసిన మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. డెయిరీ వద్ద హంగామా చేసి పాలవాహనాలను డెయిరీలోకి రాకుండా అడ్డుకుని నష్టం కలిగించారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా తగ్గేది లేదని, సంగం డెయిరీ ప్రతిష్టను దెబ్బతీయాలన్న కుట్రను చట్టపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. డెయిరీలోకి పాలు రాకుండా, బయటకు పాలు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులపై చట్టపరమైన చర్యలు చేపడతామని అన్నారు. సమావేశంలో సంగం డెయిరీ డైరెక్టర్లు కంచర్ల శివరామయ్య, వలివేటి ధర్మారావు, గొల్లపూడి శ్రీనివాసరావు, బొర్రు రామారావు, కట్టా జగన్‌మోహన్‌రావు, పులుకూరి శ్రీనివాసరావు, శేషకుమారి, మరీదు వెంకటేశ్వరరావు, దేవిరెడ్డి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆటో మోటార్స్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏఐటీయూసీ నేత రాజారెడ్డి

విశాలాంధ్ర - విశాఖ: ప్రమాదాల నివారణ పేరుతో కేంద్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ 894 తీసుకొచ్చిందని, దానికి అనుసంధానంగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం జీవో నెంబరు 21, 31 తీసుకొచ్చి మోటార్ కార్మికులపై ఆర్థిక భారాలు వేసే విధంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, జె.రాజారెడ్డి విమర్శించారు. ఇక్కడి అల్లిపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో ఉత్తరాంధ్ర ఆటో మోటార్ కార్మికుల హక్కుల సాధనకు శనివారం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలలా ఉన్న మోటార్ రంగ కార్మికులు వేలాది రూపాయలు అప్పులతో వాహనాలను కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారని చెప్పారు. వారి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఏటా లక్షల కోట్ల రూపాయలు జమ అవుతున్నాయని చెప్పారు. దీని నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెస్ రూపంలో ఒక శాతం కేటాయించి మోటార్ రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయవచ్చని అన్నారు. భారీగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, సీఎన్జీ గ్యాస్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని సూచించారు. మోటార్ రంగ కార్మికులు ప్రమాదంలో మరణిస్తే రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు ఉచిత ప్రమాద బీమా పాలసీని రాష్ట్ర ప్రభుత్వం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. మోటార్ కార్మికుల పీకకు ఉరి తగిలించే విధంగా ఉన్న జీవో నెంబరు 21, 31 లను రద్దు చేయాలి డిమాండ్ చేశారు.

మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు మాట్లాడుతూ ఆటో, మోటార్ కార్మికులంతా విధి నిర్వహణలో యూనిఫారమ్ ధరించి, రికార్డులన్నీ సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్రమాదాలకు గురికాకుండా వాహనాలు నడపాలని కోరారు. స్కూల్ ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను ఎక్కించకూడదని చెప్పారు. పరిమితికి మించి ఎక్కిస్తే కేసులు పెడతామని, దీనిని దృష్టిలో పెట్టుకొని డ్రైవర్లంతా ఆటోలు నడపాలని సూచించారు. ఆటోలో ఇన్సూరెన్స్ , ఫిట్ నెస్, లైసెన్స్ , పొల్యూషన్, పర్మిట్ ఉండాలని, ఏ రికార్డు లేకపోయినా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ రాదని తెలిపారు. దీన్ని ప్రతి ఒక్కరూ గమనించి వాహనాలు నడపాలని సూచించారు. రాబోయే రోజుల్లో డీజిల్ ఆటోలు, సీఎన్జీ ఆటోల కన్నా ఎలక్ట్రానిక్ వాహనాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ఆటో వర్కర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు షేక్ రహిమాన్, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, అధ్యక్షులు ఎం. మన్మధరావు, అనకాపల్లి జిల్లా కో కన్వీనర్ ఏసుదాసు ఏ.గణేష్, ఆటో యూనియన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, సిహెచ్. కాసుబాబు, కార్యదర్శి కే. సింహాద్రి, అడ్డూరి శంకర్రావు, కె.శివ వెంకటి, నరసింహమూర్తి పోలిరెడ్డి, వాసు, ఎం.శ్రీను, దుర్గారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

గవర్నర్ల తీరు మారేనా?

ఉన్న అధికారాలను దుర్వినియోగం చేయడంవల్ల ఎంత ముప్పు ఉంటుందో లేని అధికారాలు వినియోగించడం అంతకన్నా అనేక రెట్లు వినాశకరం. కానీ కొంత మంది గవర్నర్లు సకల విషయాల్లోనూ తమకు విచక్షణాధికారాలు ఉన్నాయన్న భ్రమలో కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రయోజనాల పరిరక్షణకు పాటు పడ్తుంటారు. ఎందుకంటే గవర్నర్ల నియామకం కేంద్ర ప్రభుత్వ ఇష్టానుసారమే జరుగుతుంది. పేచీకోరుతనం కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వాలకు, ఆ రాష్ట్ర గవర్నర్లకు మధ్య ఘర్షణకు దారి తీస్తుంది. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరవాత నియమితులైన కొందరు గవర్నర్లు తమకు సర్వాధికారాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఈ పరిస్థితి బీజేపీయేతర రాజకీయ పక్షాలు అధికారంలో ఉన్న చోట్లే ఎక్కువగా కనిపిస్తోంది. కొందరు గవర్నర్లు తాము గవర్నరుగా ఉన్న బీజేపీయేతర ప్రభుత్వానికి "రాజకీయ ప్రత్యర్థులం" అనుకుంటున్నట్టున్నారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించాలి. కానీ ఇటీవల కొన్ని సందర్భాలలో గవర్నర్లు ఆ బిల్లులకు అటు ఆమోదం తెలియజేయకుండా ఇటు మళ్లీ రాష్ట్ర శాసనసభకు పంపకుండా తమ దగ్గరే ఉంచుకుని ఆ బిల్లు పరిస్థితి ఏమిటో తెలియని అయోమయ అవస్థలో పడేస్తున్నారు. పంజాబ్ గవర్నర్ బన్వారీలాల్ పురోహిత్ ఇలా శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా గత జూన్ నుంచి ఉలకక పలకక తన దగ్గరే ఉంచేసుకున్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి తొక్కి పెట్టేశారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నందువల్లే ఇటీవలే ఆ బిల్లులను శాసనసభకు తిప్పి పంపారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ ఖాన్ అయితే కొన్ని బిల్లులను మూడేళ్లుగా నానుస్తూనే ఉన్నారు. శాసనసభలు రూపొందించిన బిల్లులను సమయానికి ఆమోదించకపోతే ఒక్కో సారి పరిపాలన స్తంభించిపోయే స్థితి వస్తుంది. ఆ బిల్లుల ద్వారా ప్రజలకోసం ఉద్దేశించిన విధానాలు అమలుకాకుండా ఉండిపోతాయి. అంటే ప్రజలు ఎన్నుకున్న శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు మురగబెట్టడం అంటే పరిపాలనకు అడ్డు తగలడమే. తమ రాజ్యాంగ విధులను విస్మరించడమే. పేచీకోరు గవర్నర్లతో వేగలేని పంజాబ్, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. అందులో పంజాబ్ పిటిషన్ పై ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ తో కూడిన ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు బెంచి గురువారం తన అభిప్రాయం విస్పష్టంగా తెలియజేసింది. గవర్నర్ల నడవడికను నేరుగా తప్పు పట్టింది. గవర్నర్లకు వీటోచేసే అధికారంలేదని తేల్చి చెప్పింది. పంజాబ్, తమిళనాడు, కేరళలో గవర్నర్ల ఆమోదం లభించకుండా మూలుగుతున్న బిల్లుల్లో ప్రజారోగ్యం, ఉన్నత విద్య, లోకాయుక్త, సహకార సంఘాల వంటి ముఖ్యమైన బిల్లులు ఉన్నాయి. ఒక బిల్లు చట్టం కావాలంటే గవర్నర్ ఆమోద ముద్ర మనం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య విధానంలో తప్పని సరి. చట్టసభ ఆమోదించిన బిల్లుల్లో గవర్నరుకు అభ్యంతరకరమైనవి ఏమైనా ఉంటే వాటిని ప్రభుత్వానికి తిప్పి పంపవచ్చు. సవరణలు ఏమైనా ఉంటే అవీ సూచించవచ్చు. చిక్కంతా ఎక్కడ ఉందంటే గవర్నర్ ఒక బిల్లుకు ఆమోద ముద్ర వేయడానికి ఎంత సమయం తీసుకోవచ్చునో కచ్చితమైన సూత్రం ఏమీ లేదు. రాజ్యాంగంలోని 200వ అధికరణం కూడా "వీలైనంత త్వరగా" అని మాత్రమే చెప్పింది. నిర్దిష్ట గడువు విధించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కేంద్ర ప్రభుత్వానికి విధేయంగా ఉండే గవర్నర్లు నిరవధికంగా ఆ బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా తొక్కి పెడ్తున్నారు. ఈ వ్యవహారం 1972లో, 2020లో సుప్రీంకోర్టు పరిశీలనకు వచ్చింది. ఈ రెండు సదర్భాలలో కూడా సుప్రీంకోర్టు గడువు ఏమీ నిర్ణయించలేదు కానీ 2020లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి "వీలైనంత త్వరగా" అంటే మూడు నెలలు అనుకోవచ్చు అన్నారు. బిల్లులు ఆమోదించే ముందు ప్రభుత్వాలు గవర్నర్లను సంప్రదించాలిఅని 1988లో సర్కారియా కమిషన్ సూచించింది. అయితే ఇది చట్టసభ ప్రాథమ్యాన్ని తగ్గించడమే. దాదాపు అన్నిరాష్ట్రాలలో కాంగ్రెసేఅధికారంలోఉన్న రోజుల్లో కూడా కేంద్ర ప్రభుత్వం లేదా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి "విధేయంగా" వ్యవహరించిన రాం లాల్ లాంటి గవర్నర్లు లేకపోలేదు. కొన్నిరాష్ట్రాలలో బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉండడం, ఆ రాష్ట్రాలకు కావాలనే కజ్జాకోరు గవర్నర్లను నియమించడం వల్లే రాష్ట్రాలప్రభుత్వాలకు, గవర్నర్లకుమధ్య వివాదాలు ముదిరిపోతున్నాయి.

ఈ నేపథ్యంలోనే శాసనసభలు ఆమోదించిన బిల్లులను వీటో చేసే అధికారం గవర్నర్లకు లేదని పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు నిర్దిష్టంగా తేల్చి చెప్పింది. ఈ ఆదేశాలే తమ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూ వర్తిస్తాయని కేరళ ప్రభుత్వ తరఫు న్యాయవాది కె.కె.వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు దీనితో ఏకీభవిస్తూ కేరళ గవర్నర్ పంజాబ్ విషయంలో తమ నిర్ణయాన్ని చదువుకోవాలని సూచించింది. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ లాంటి పండితుడికి నిస్సందేహంగా అవమానకరమైన విషయమే. పరిపాలనకు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరించే విధానాలకు అడ్డు తగిలే, బిల్లులను ఆమోదించకుండా తొక్కి పెట్టే విచక్షణాధికారాలు లేవు. ఈ విషయాన్ని ఇతర గవర్నర్లూ గ్రహిస్తే మంచిది. చట్ట సభ ఆమోదించిన బిల్లులు గవర్నరుకు సమ్మతం కాని సందర్భాలు ఉండవచ్చు. పార్లమెంటు ఆమోదించిన బిల్లుల విషయంలో రాష్ట్రపతికి కూడా అభ్యంతరాలు ఉండొచ్చు. రాజీవ్ ప్రధానిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తపాలా బిల్లును పార్లమెంట్లో ఆమోదింప చేస్తే అప్పటి రాష్ట్రపతి జైల్ సింగ్ దానికి ఆమోద ముద్ర వేయలేదు. కానీ అప్పటి రాజీవ్ ప్రభుత్వం తపాలా బిల్లుపై పట్టుపట్టకుండా వదిలేయడంతో వివాదం ముగిసింది.

ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల గవర్నర్లే "వీలైనంత త్వరగా"బిల్లులను ఆమోదించాలన్న సూత్రాన్ని ఖాతరు చేయడం లేదు. బిల్లులో ఏవైన అంశాలతో గవర్నర్లు సమ్మతించకపోతే ఆ బిల్లులను వెనక్కి పంపొచ్చు. గవర్నర్ ఏమైనా సూచనలు చేస్తే వాటిని శాసనసభ అంగీకరించి తగిన సవరణలు చేసి మళ్లీ గవర్నరుకు పంపొచ్చు. లేదా యథాతథంగా మళ్లీ ఆమోదించి పంపితే గవర్నరు ఆమోదించక తప్పదు. మళ్లీ శాసనసభకు పంపే అవకాశం లేదు. కానీ ఆమోదం తెలియజేయడానికి నిర్ణీత వ్యవధి లేని కారణంగా కొందరు గవర్నర్లు ఎటూ తేల్చక రాష్ట్ర ప్రభుత్వాలను ఇరుకున పెడ్తునారు. కొన్ని సార్లు గవర్నర్లు తమకు సమ్మతి లేని బిల్లులు వస్తే వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపవచ్చు. రాష్ట్రపతి కూడా కేంద్ర మంత్రివర్గ సలహా మేరకు నడుచుకోవలసిందే. గవర్నర్లకు స్వయం నిర్ణయాధికారం లేదు. ప్రజలెన్నుకున్న చట్ట సభకే రాజ్యాంగం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉండే విధానం. గవర్నరును రాష్ట్రపతి నియమిస్తారు. అదీ కేంద్ర ప్రభుత్వ సిఫార్సు ఆధారంగా మాత్రమే. గవర్నర్ రాష్ట్రపతికన్నా అధికుడు కాదు. తమిళనాడు, కేరళ పిటిషన్ల పై వచ్చే మంగళవారం విచారణ కొనసాగుతుంది. ఆ తరవాతే సమగ్రమైన తీర్పు వెలువడుతుంది. అప్పుడైనా పేచీకోరు గవర్నర్ల తీరు మారుతుందేమో చూడాలి. లేకపోతే అసలు గవర్నర్ల వ్యవస్థనే రద్దు చేయాలని ఇప్పటికే ఉన్న డిమాండ్లు మరింత విస్తృతంగా వినిపిస్తాయి.

రాజ్యాంగ స్ఫూర్తి - లౌకికతత్వం

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

భారత్ సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర దేశం. 'భౌతిక ప్రపంచానికి చెందిన, ఆధ్యాత్మికంకాని, మతాతీతమైన' అని లౌకికత్వానికి అర్థాలు. మత స్వేచ్ఛ, హేతు, భౌతిక, మానవతావాదాల పట్ల సహనం, గౌరవం లౌకికమని ఆస్ట్రేలియా రాజ్యాంగ ఆచార్యుడు ఆంథొని రొలాండ్ బ్లాక్ షీల్డ్ నిర్వచించారు. "లౌకిక దేశం పౌరులకు మతస్వేచ్ఛనిస్తుంది. ఏ మతానికీ చెందదు. మతంలో జోక్యం చేసుకోదు. మతాన్ని ప్రోత్సహించదు." అమెరికా పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయ రాజకీయశాస్త్ర గౌరవ ఆచార్యుడు డొనాల్డ్ యూజీన్ స్మిత్ అన్నారు."రాజ్యాంగంలో మనదని చెప్పుకోదగ్గ అంశమే లేదు. మనుస్మృతి ప్రపంచ సమ్మతి, ప్రశంసలను, యాదృచ్ఛిక విధేయతను, అనుగుణ్యతను పొందింది." అని సంఘ్ గురు మాధవ్ సదాశివ్ గోల్వల్కర్ అమానవీయ అసమానత, అలౌకికత్వాలను పొగిడారు. రాజ్యాంగంలోని 1(1)భారత్ రాష్ట్రాల సమాఖ్య,19(1) భావ ప్రకటనా స్వేచ్ఛ, 21 జీవన హక్కు,25(1) మత స్వేచ్ఛ, 51(1)(హెచ్) శాస్త్రీయ దృక్పథం లాంటి అనేక అధికరణలను సంఘ్ ప్రభుత్వం ధిక్కరించింది.

షా బానో కేసులో, ముస్లింలైనా విడాకులిచ్చిన భార్యలకు మనోవర్తి చెల్లించాలని సుప్రీంకోర్టు 23.04.1985 న తీర్పిచ్చింది. రాజకీయ లబ్ధి కోసం నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ ఈ తీర్పును గౌరవించలేదు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్‌ఖాన్‌ను తయారుచేశారు. బాబ్రి మసీదును కూలుస్తున్నా మిన్నకున్న నాటి సంఘీయ-కాంగ్రెస్ ప్రధాని నరసింహారావు, ఆద్వాణి, ఉమాభారతి, కల్యాణ్‌సింఘ్, మురళీమనోహర్‌జోషీ లను వ్యూహాత్మకంగా కేసు నుండి తప్పించిన నాటి యుపి ముఖ్యమంత్రి రాజ్‌నాథ్‌సింఘ్, అంటీముట్టనట్లుండిన కాంగ్రెసీయులు మత రాజకీయులే. ముంబయి మతోగ్రదాడిపై శ్రీకృష్ణ కమిటీ నివేదిక బుట్టదాఖలు, గోధ్రాజాతి హత్యల నిందితులను వదిలేయటం రాజకీయమే. ప్రపంచీకరణ ప్రపంచాన్ని మతీకరించింది. మతాన్ని రాజకీయాకరించింది. రాజకీయాల్లో మతం దూరింది. మతోన్మాదులు ప్రజలను రెచ్చగొట్టి ఘర్షణలను, హింసను ప్రేరేపిస్తున్నారు. అధికారంతో రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, సామాజికంగా బలపడిన సంఘీయులు హిందూయేతరులను, అవిశ్వాసులను, తమ తాత్వికతతో విభేదించేవారిని పాకిస్తాన్ పొమ్మన్నారు. సర్వమత ప్రజల సొమ్మును ఒక మత వేడుకలకు ఖర్చుపెట్టవచ్చా?నేటి పాలకులు చేస్తున్న ఈ పనులు రాజ్యాంగ విరుద్ధం. కాషాయ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్‌ఉపాధ్యాయ బోధనలతో భారత విదేశీశాఖ పుస్తకాన్ని ప్రచురించి విదేశాల్లో పంచి సంఘ్ భావజాలాన్ని ప్రచారంచేస్తోంది. ఈ ఖర్చు ప్రజల సొమ్మే. సంఘ్ సిద్ధాంత కర్త దీనానాథ్ బాత్రా రచించిన 'తేజోమయ భారత్' మొదలగు హిందుత్వ తాత్విక పుస్తకాల ముందుమాటల్లో, సభల్లో, సైన్సు కాంగ్రెస్‌లో ప్రధాని హైందవపురాణ ఊహాగాథలను నిజాలుగా, విజ్ఞాన శాస్త్రాంశాలుగా వర్ణించారు. ప్రజల శాస్త్రీయదృక్పథాన్ని పెంచాలన్న రాజ్యాంగ అధికరణ 51(1)(హెచ్)ను తుంగలో తొక్కారు. '82% హిందువులున్న దేశాన్ని హిందుత్వంతో, భగవత్ భావజాలంతో మోదీ ఏలాలనుకుంటున్నారు. ఇతర మతాలను క్రమేపీ నాశనం చేయాలనుకుంటున్నారు' న్యాయమూర్తి పి.బి.సావంత్ వ్యాఖ్యానించారు.

రాజ్యాంగ అధికరణ 14 ప్రకారం రాజ్యం ఏ వ్యక్తికీ చట్ట సమానత్వాన్ని తిరస్కరించరాదు, చట్టాలను సమానంగా పరిరక్షించాలి. అధికరణ 15 ప్రకారం ప్రజలు జాతి, మత, కుల, లింగ, జన్మ స్థలాల ఆధారంగా ఏ వివక్షకు గురికాకుండా రాజ్యం కాపాడాలి. అధికరణ 15(3) మహిళలకు, పిల్లలకు ప్రత్యేక నిబంధనల అవకాశం కల్పిస్తుంది. మైనారిటీ మతాల్లోనూ రాజ్యాంగ స్ఫూర్తితో స్త్రీ సమానత్వానికి తెరతీయాలి. ప్రార్థనాలయాల్లో ప్రాతినిధ్యం కల్పించాలి. మన ఉన్నత వర్ణాల వనితలూ అంటరానివారే. "నిమ్న" జాతి మనుషుల్లాగా మ్లేచ్ఛులే. రాజ్యాంగ అధికరణలు 14,15 లకు అనుగుణంగా పార్లమెంటులో మహిళా రిజర్వేషన్లకు చట్టం చేయాలి. మగాళ్లకు సీట్ల హామీనిచ్చి 2034 లో స్త్రీలకు అమలుకాగల మోసపూరిత వనితల వోట్ల సమీకరణ చట్టాలతో ప్రయోజనం లేదు.

నిబంధన 25 సిక్కు, జైన, బౌద్ధులను హిందువులుగా పేర్కొని, అపోహలు, అపార్థాలు, అనాచరణలకు దారితీసింది. లౌకికత్వాన్ని నీరుగార్చిందని మానవహక్కుల కార్యకర్తల, రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం. మతాంశాల జోలికి పోకుండా అవసరమైతే కేవలం ఆలయాల నిర్వహణ, పాలనాంశాలను ప్రభుత్వాలు చేపట్టవచ్చని అధికరణ 25 ప్రస్తావించింది. ఆమేరకు దేవాదాయ శాఖలు, వక్ఫ్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఆలయాల నిర్వహణ, పాలనల్లో పాలుపంచుకోటం దేవాదాయ శాఖ విధుల్లో భాగం కావచ్చు. కాని పాలకులు సతీసంతానాలతో దేవాలయాల కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దేవతలకు బట్టలిస్తున్నారు. దేవతలకు బట్టలివ్వటం, పూజల, యజ్ఞాల, క్రతువుల, పుష్కరాల నిర్వహణ రాజ్యాంగ విరుద్ధం. అనేక నిబంధనల ద్వారా భారత రాజ్యాంగం లౌకికత్వాన్ని సమర్థిస్తోంది. నేటి పరిస్థితుల్లో మతోన్మాద నియంత్రణ, లౌకికత్వ పునరుద్ధరణ అత్యవసరం. లౌకిక రాజ్యం మత మైనారిటీలకే కాదు మెజారిటీ మతస్థుల సంక్షేమానికీ అవసరం. మత కల్లోలాలు జరక్కుండా లౌకికభావాలను పెంపొందించాలి. మత ప్రమేయంలేని రాజకీయాలు అమలుకావాలి. వ్యక్తిగత స్వేచ్ఛలో జోక్యం చేసుకోని మేరకే మత స్వేచ్ఛను అనుమతించాలి. సామాజిక వైఖరిని, దృక్పథాన్ని సకారాత్మకంగా మార్చాలి. బహుళ మతాల, సంస్కృతుల భారత సమాజంలో పాలకులు, నాయకులు, అధికారులు, ప్రజలు లౌకికత్వాన్ని రక్షించుకోవాలి. రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించుకోవాలి.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
చరవాణి:9490204545

రాజ్యాంగ రక్షణల మీద సడలుతున్న ప్రజావిశ్వాసం

డా॥ జి.కె.డి.ప్రసాద్
సెల్: 9393111740

భారత రాజ్యాంగం పౌరులందరికీ ప్రాథమిక హక్కులు ఇవ్వడంతో పాటు నిమ్న కులాలకు, బలహీన వర్గాలకు, మహిళలకు, అల్ప సంఖ్యాకులకు ప్రత్యేక రక్షణలు కల్పించింది. భారతదేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, గణతంత్ర రాజ్యమని రాజ్యాంగ ప్రవేశిక వివరిస్తోంది. ఆదేశిక సూత్రాలు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రజలందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం చేకూరాలని నిర్దేశిస్తున్నాయి. రాజ్య లక్ష్యాలు, ధ్యేయాలు, ఆశలు, ఆశయాలు ప్రభుత్వ స్వరూప, స్వభావాల మీద ఎన్నో విస్తృత వ్యాఖ్యానాలు కుప్పలతెప్పలుగా లభిస్తున్నాయి. అంతేగాక శ్రేయోరాజ్యం అని ప్రజలు విశ్వసిస్తున్నారు. రాజ్యాంగ రచనలో పొందుపరిచిన రక్షణలే అంతర్జాతీయ సమాజంలో భారతదేశాన్ని అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా నిలబెట్టాయని న్యాయకోవిదులు విశ్లేషిస్తుంటారు. ఈ నేపథ్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 జన్మదిన వేడుకలు సందర్భంగా భారత ప్రభుత్వం ముంబయి 'ఇందు మిల్స్' ను 'డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్స్' గా మార్చింది. ఈ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. అక్కడే నవంబరు 26 వ తేదీని 'రాజ్యాంగ దినోత్సవం' గా ఆయన ప్రకటించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షునిగా రాజ్యాంగ ముసాయిదా సంఘం 21 ఫిబ్రవరి, 1948 ని తన నివేదికను రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించింది. అనేక చర్చల అనంతరం 26 నవంబర్ 1949 న పరిషత్ రాజ్యాంగాన్ని ఆమోదించింది. దీనినే రాజ్యాంగ దినోత్సవంగా ప్రభుత్వం నిర్ణయించింది.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దీని నిర్మాణానికి సంబంధించిన కొన్ని విషయాల్ని గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. డాక్టర్ అంబేద్కర్ బౌద్ధ సాహిత్యాన్ని, పూలే విద్యావ్యాప్తిని, బుకర్.టి.వాషింగ్‌టన్ నల్ల జాతీయుల హక్కుల ఉద్యమాన్ని, జస్టిస్ రనడే, జాన్‌డ్యూయీ, ఎడ్మండ్‌బర్గ్, లాస్కీ వంటి రాజనీతితత్త్వవేత్తలను అధ్యయనం చేసిన వారిగా పేరొందారు. అందుకే ఆయన రాజకీయ, ఆర్థిక ప్రజాస్వామ్యాల ద్వారా సామాజిక ప్రజాస్వామ్యం అవతరించాలని ఆశించారని భావించొచ్చు. ఈ కారణంగానే రాజ్యాంగ పరిషత్తు ముందు ప్రత్యేక రక్షణలను పొందుపరిచి ఆమోదింపజేయగలిగారు. కాని అనాదిగా ఈ రక్షణలు సక్రమంగా అమలు జరగడం లేదని చెప్పొచ్చు. భారత ప్రజాస్వామ్యం పెను సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో రాజ్యాంగ రక్షణలు మరింత నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇటీవల దేశంలో ఈ దుస్థితిని సమర్థించే ఘటనలు చాలానే చోటు చేసుకున్నాయి. దేశంలో పేదరికం భయంకరంగా అలుముకుంది. అన్ని శ్రేణుల ప్రజలకు నాణ్యమైన విద్య అందడం లేదు. భిన్న సంస్కృతుల మధ్య చోటు చేసుకున్న

సామాజిక అసమతుల్యతలు అనేక వివక్షలను సృష్టించాయి. లౌకిక రాజ్యాంగం మత స్వేచ్ఛ కల్పించినప్పటికీ అల్ప సంఖ్యాకుల మీద దాడులు అధికమయ్యాయి. ప్రపంచ ప్రమాణాలకు తగిన వైద్య సదుపాయాలు లేవు. ఈ దేశంలో మానవ హక్కులు తీవ్ర రుగ్మతలతో సతమతమవుతున్నట్టు 'హ్యూమన్ రైట్స్ వాచ్' అనేక మార్లు హెచ్చరించింది.

ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థలుగా కొనసాగుతున్న అమెరికా, చైనా దేశాలతో భారతదేశాన్ని పోల్చి చూస్తే వాస్తవాల్ని గమనించొచ్చు. ప్రపంచ బ్యాంకు అమెరికా సెన్సెస్ బ్యూరో 2017 గణాంకాల ప్రకారం ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా 32.57 కోట్ల జనాభా, జీడీపీ 19.39 లక్షల కోట్లు అమెరికన్ డాలర్లలో నిలిచింది. భారతదేశ 133.92 కోట్ల జనాభా, జీడీపీ 2.6 లక్షల కోట్లు, అమెరికన్ డాలర్‌గా మిగిలింది. చైనా 138.64 కోట్ల జనాభా, జీడీపీ 12.24 లక్షల కోట్లు అమెరికన్ డాలర్లుగా భారత్ కంటే పై స్థానంలో ఉంది. ఈ గణాంకాల ప్రకారం భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా మాత్రమే మిగులుతుంది. విద్యారంగంలో అమెరికా, చైనా దేశాలు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలను ఆకర్షిస్తున్నాయి. అమెరికాలో జీవిస్తున్న భారత జనాభా 4.4 మిలియన్లు కాగా అధిక జనాభా కలిగిన చైనా నుంచి 3.8 మిలియన్లు మాత్రమే అక్కడ జీవిస్తున్నారు. ప్రపంచంలో అత్యధిక యువత కలిగిన దేశంగా భారత్ ముందు వరుసలో ఉంది. 25 ఏళ్లలోపు వయసు కలిగిన 600 మిలియన్ల జనాభా ఇక్కడ ఉంది. 2028 నాటికి దిల్లీ నగరం 37 మిలియన్ల జనాభాతో అతి పెద్ద నగరంగా అవతరించనుందని అమెరికా సంస్థలు అంచనా వేస్తున్నాయి. అదే సమయంలో జనాభావృద్ధిని ఆర్థిక వృద్ధిగా మార్చుకొనే నైపుణ్యాన్ని భారత్ ప్రదర్శించాలని ఆ సంస్థలు సూచిస్తున్నాయి.

విద్యా విషయకంగా పూర్వాపరాలను పరిశీలిస్తే, భారతదేశం ఎందుకు ముందంజలో నిలవలేకపోయిందో అంచనా వేయొచ్చు. బ్రిటన్‌లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ 1096లో, అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం 1636లోను స్థాపించారు. భారత్‌లో బ్రిటీష్ విద్యా విధానంలో 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాస్ విశ్వ విద్యాలయాలు నెలకొల్పారు. భారత్ కంటే 12 ఏళ్లు ఆలస్యంగా 1869లో చైనా బీజింగ్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించింది. ఐనప్పటికీ భారత్ విశ్వవిద్యాలయాల కంటే అది ముందు వరుసలో ఉంది. అంతకు పూర్వం భారతదేశంలో విద్యా విధానం హిందూ గురుకులాల్లోను, ముస్లిం ముక్తాబ్స్‌ల్లోను, మదరసాల్లోను జరిగేది. భారతదేశానికి స్వాతంత్ర్యం చేకూరేనాటికి సుమారు 90 శాతం నిరక్షరాశ్యత ఉంది. అక్కడ మొదలుపెట్టిన ప్రయాణం ఇప్పటికి 74.04 శాతానికి చేరుకుంది. చైనా అక్షరాశ్యత శాతం 96.36. ఇప్పటికీ భారతదేశంలో 37 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన జీవిస్తున్నారు. కనీసం ప్రాథమిక విద్య కూడా వీరికి అందడంలేదు. ప్రభుత్వ పాఠశాలలు ప్రజల నమ్మకాన్ని పొందలేకపోతున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలు ధనికులకు తప్ప సామాన్యులకు అందుబాటులో లేవు. కొన్ని ప్రాంతాల్లో మూఢ నమ్మకాలతో ఆధునిక విద్యకు దూరమవుతున్నారు. అన్ని రంగాల్లోను ప్రైవేటీకరణ చొరబడటం మరో పెద్ద అడ్డంకి. ఆదేశ సూత్రాలను అనుసరించి 14 ఏళ్లవయసు వచ్చేవరకు ప్రతి భారతీయ పౌరునికి ఉచిత నిర్బంధ విద్య అందించాలి. అధికరణ 30 ప్రకారం మతం, భాష ఆధారంగా అల్ప సంఖ్యాక వర్గాల విద్యా హక్కులను పరిరక్షించేందుకు విద్యా సంస్థలు నిర్వహించాలి. 15, 17, 46 అధికరణల ప్రకారం బలహీన వర్గాలకు, నిమ్న జాతులకు, తెగల విద్యాహక్కును పరిరక్షించాలి. 25 (1) అధికరణ పౌరుల అంతరాత్మ ప్రబోధానుసారం తమ ఇష్టమయిన మతాన్ని ఆచరించవచ్చు. 14, 15, 16, 39 అధికరణలు మహిళలు విద్యా, అభివృద్ధికి సంబంధించిన రక్షణలు కల్పించాయి. ఐనప్పటికీ బలహీనవర్గాల, కులాల, మహిళలకు రక్షణ కల్పించడంలో వైఫల్యాలు ఉన్నాయి. ఈ సమూహాలన్నీ వెనుకబడే ఉన్నాయి.

చివరికి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ కూడ ప్రమాదంలో చిక్కుకుంది. హిందూ ఆధిపత్యం హింసను ప్రోత్సహించింది. మైనారిటీ వర్గాల్లో అభద్రతా భావం నిండిపోయింది. మరెన్నో రాజ్యాంగ రక్షణలు ప్రశ్నార్థకంగానే మిగిలి పోయాయి. డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్ 25 నవంబర్ 949 ఆఖరి సమావేశంలో ముసాయిదాను సభకు పరిచయం చేస్తూ..."స్వాతంత్ర్య ఫలాలు అందరికీ సమంగా అందించడానికి తగిన రాజ్యాంగ రచన జరిగింది. దీనిని అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలదే . మనం నిందించడానికి బ్రిటీషు వారు ఇక్కడ ఉండరు." అన్నారు. దేశీయ పాలకులు దీనిని బలంగా అర్థం చేసుకోవాలి.

వైజ్ఞానిక స్వాప్నికుడు, నిరీశ్వరవాది, తొలి ప్రధాని నెహ్రూ

డాక్టర్ దేవరాజు మహారాజు

వైజ్ఞానిక రంగంలో మనదేశం ఈ రోజు ప్రపంచంలో తలెత్తుకుని నిలబడిందంటే అందుకు కారణం మన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ హేతువాది, నెహ్రూయే. ఆయన వైజ్ఞానిక స్వాప్నికుడు, నిరీశ్వర వాది, గొప్ప దార్శనికుడు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాల్ని త్యాగం చేసిన త్యాగ ధనులు ఆ కాలంలో ఎంతో మంది ఉన్నారు. కాని, ఎవరికీ లేని వైజ్ఞానికా దృక్పథం, పట్టుదల కార్యదీక్ష ఉన్నందు వల్లనే జవహర్‌లాల్ నెహ్రూ ఈ దేశానికి తొలి ప్రధాని దేశ నిర్మాత కాగలిగారు. గాంధీజీని జాతిపితగా దేశం గుర్తుంచుకుంది. అలాగే జాతి నిర్మాతగా నెహ్రూని గౌరవించుకుంది. బ్రిటిష్ వారు ఇండియాను వదిలి వెళ్ళిన తర్వాత, ఈ దేశ పరిస్థితి ఎలా ఉంది? మూడు వందల ఏళ్లు నివాసముండి, ఇల్లు ఖాళీచేసి పోయినట్లుగా అస్తవ్యస్తంగా, చిందరవందరగా, అస్థిరంగా ఉంది. అన్నీ చక్కదిద్దుకుంటూ, చాకచక్యంగా అన్ని రంగాల్ని సంఘటిత పరుస్తూ దేశాన్ని పునర్నిర్మించారు - నెహ్రూ! దేశంనిండా చిన్న చిన్న సంస్థానాలు రాజ్యమేలుతున్నప్పుడు వాటిని ఒక్కతాటిపైకి తెచ్చి విశాల భారతానికి రూపకల్పన చేశారు. సంస్థానాల్ని విలీనం చేసుకున్న ఘనత అంతా వల్లభ్‌భాయ్ పటేల్‌దేనని ఇప్పటి ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తూ ఉంది. ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే విషయం అర్థమవుతుంది. పటేల్‌ను మనం ఏ మాత్రం తక్కువచేసి మాట్లాడాల్సిన అవసరంలేదు గానీ, ఆయన నెహ్రూ కేబినెట్‌లోని హోమ్ మినిస్టర్ మాత్రమే! ప్రధానికి తెలియకుండా ఏ హోంమంత్రీ నిర్ణయాలు తీసుకోడు. వాటిని అమలు చేయలేడు. పండిట్ నెహ్రూ అనుమతి, అంగీకారం లేకుండానే పటేల్ దేశ సమైక్యతకు కృషి చేశారనడం అర్థ సత్యం. అలాగే కాశ్మీర్ విషయంలో నెహ్రూ తప్పు చేశారని నేటి ప్రభుత్వ పెద్దలు డప్పుకొట్టడమూ అర్థ సత్యమే. నిజంగా అది తప్పయితే నాటి హోంమంత్రి పటేల్ బాధ్యత కూడా అందులో ప్రధానంగా ఉంటుంది.

రాజకీయాలు పక్కన పెట్టి, నెహ్రూజీ ఎందుకు దార్శనికుడయ్యారో చూద్దాం. ముందు చూపుతో ఈ దేశానికి కావల్సినవన్నీ సమకూర్చి వాటిని పటిష్ట పరిచడానికి నిరంతరం కృషిచేసిన వాడాయన. ఆయన దేశ ప్రధానిగా ఉన్న పదిహేడేళ్ల కాలంలో "భారతదేశ ఆధునిక దేవాలయాలు' అనదగిన ఎన్నో ప్రాజెక్టులు పూర్తిచేశారు. ఆయన కాలంలోనే అవన్నీ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పండిట్ నెహ్రూ వైజ్ఞానిక స్పృహగల ప్రధాని గనుక, ఈ దేశ ప్రజలకు విద్య అవసరమని, మరీ ముఖ్యంగా వైజ్ఞానిక విద్య - పరిశోధన చాలా అవసరం అని గుర్తించారు. ఆయన తీసుకున్న చొరవ వల్లనే దేశమంతటా శాస్త్ర పరిశోధనాశాలలు విస్తృతంగా అభివృద్ధి అయ్యాయి. ఇప్పుడు దేశంలో ఉన్న ప్రముఖ వైజ్ఞానిక సంస్థను దేన్ని తీసుకున్నా, దాని నేపథ్యంలో నెహ్రూయే కనిపిస్తారు. ఉదాహరణకు ప్రస్తుతం విజయ దుందుభి మోగిస్తున్న ఇండియన్ స్పేస్ రీసర్చ్ ఆర్గనైజేషన్ సెంటర్, బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమీ ఏరిడ్ ట్రాపిక్స్, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి ముఖ్యమైన పరిశోధనా కేంద్రాలన్నింటికీ రూపకల్పన చేసింది, ప్రారంభించింది, అవి సజావుగా నడవడానికి

స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని ముఖ్యంగా ఆర్థిక వనరుల్ని సమకూర్చింది మన తొలి ప్రధాని నెహ్రూజీయే. అంతేకాదు, రక్షణశాఖకు సంబంధించిన ఎన్నో పరిశోధనా కేంద్రాలకు నెహ్రూ ఊత మిచ్చారు. డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లాబొరెటరీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ లాబొరెటరీ, డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వంటివి మరెన్నో ఉన్నాయి. స్వాతంత్ర్యం లభించిన తొలినాళ్ళలో భారతదేశ పరిస్థితి - తుపానులో కొట్టుకొచ్చిన మొక్క లాంటిది. దాన్ని నిలకడగా ఉంచి నారు, నీరు పోసి, వేళ్ళు భూమిలో నాటుకునేట్టుచేసి, నిటారుగా నిలబెట్టడం ఆషామాషీ కాదు. ఎంతో అంకిత భావం కావాలి.

పరాయి పాలనలో అస్థిత్వాన్ని కోల్పోయిన ఈ దేశం సర్వస్వతంత్రంగా నిలదొక్కుకోవడానికి, ఎదిగి మహావృక్షమై విస్తరించడానికి తొలి నాళ్ళలో నెహ్రూ చేసిన ప్రయత్నం అసామాన్యం. ఆయనలోని వైజ్ఞానిక దృక్పథం, లలితకళలపై గల మక్కువ, పిల్లలంటే ఉండే ప్రేమ ఆయనతో ఎన్నో పనులు చేయించింది. సాహిత్య, సాంస్కృతిక అకాడెమీలు, బాలల అకాడెమీ వంటి ఇతర జాతీయ సంస్థలన్నింటినీ ప్రారంభించి, నిలబెట్టింది నెహ్రూజీనే. అర్థశతాబ్దానికి పైగా నిరంతరం పరిశోధనలకు అంకితమైన ఈ జాతీయ పరిశోధనా సంస్థలకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా కేటాయించే నిధులే ఇవ్వలేకపోతూ ఉంది. ఇది నేటి దుస్థితి. పైగా ప్రయివేటు సంస్థలు, వ్యక్తుల నుండి ఆర్థిక వనరులు సంపాదించుకోవాలని సూచిస్తోంది. ఎందుకంటే ఈ ప్రభుత్వానికి యోగులు, సాధువులు, బాబాలు తప్ప వైజ్ఞానికులు కనబడడం లేదు. నెహ్రూజీకి ఉన్న వైజ్ఞానిక దృక్పథం ఆరెస్సెస్‌కు దాని అనుబంధ సంస్థలకు నచ్చదు. అందుకే ఆయనను, ఆయన కృషిని తక్కువచేసి మాట్లాడుతూ ఉంటుంది. వెనక్కి నడిచేవాడికి ముందుకు పోయేవాడు నచ్చుడు కదా? భాక్రానంగల్, సట్లజ్, హీరాకుడ్, మహానది, నాగార్జునసాగర్ వంటి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణాలన్నీ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడే అయ్యాయి. గంగ, యమున, కావేరి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, కృష్ణా నదులపై ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది ఆయన హయాంలోనే. వాటివల్ల దేశంలో హరితవిప్లవం సాధ్యమైంది. తాగునీరు దొరికింది. సామాన్యుల జీవన ప్రమాణాలు పెరిగాయి. వ్యవసాయరంగమే కాదు, పారిశ్రామిక రంగంలోనూ నెహ్రూ నేతృత్వంలో ఈ దేశం గణనీయమైన ప్రగతిని సాధించింది. బొకారో, జంషెడ్‌పూర్, రూర్కెలా, హిందుస్థాన్ జింక్ వంటి ఉక్కు పరిశ్రమలు, నాల్కో వంటి అల్యూమినియం పరిశ్రమలు, ఓయన్‌జిసి వంటి చమురు కేంద్రాలు, దేశవ్యాప్తంగా ఎన్నో ఓడరేవులు నెహ్రూ చొరవతో నిర్మాణమై దేశాన్ని అన్ని విధాలా నిలబెట్టాయి. దేశ అవసరాలు పూర్తిచేయడమే కాకుండా ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతిచేసే దశకు చేరుకున్నాయి. వైద్యానికి, ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులు దేశంలోనే తయారు కావాలన్నది ఆయన ఆశయం. దాన్నే సాధించారు కూడా!

దేశానికి ఊపిరులూదిన పండిట్ నెహ్రూ కృషిని తక్కువచేసి మాట్లాడే వారు చారిత్రక సత్యాలు తెలుసుకుంటే మంచిది. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలో ప్రతిపక్షంలో మహానుభావులెంతో మంది ఉండేవారు. ఎన్నో విమర్శలు చేసేవారు. అవి పనికొచ్చేవయితే ఆయన తప్పకుండా ఆలోచించే వారు. కార్టునిస్ట్ శంకర్‌ను దగ్గరకు పిల్చుకుని "శంకర్ నువ్వు స్వేచ్ఛగా, సహేతుకంగా విమర్శించు. అధికారంలోఉన్న మా అహంకారాన్ని ఎప్పటి కప్పుడు వదిలిస్తూ ఉండు" అని సలహా ఇచ్చారు. అలాంటి సంస్కారం మరి ఇప్పటి నాయకులకు ఎందుకులేదూ? నర్మదానది పరీవాహక ప్రాంతంలో డెబ్బయి రెండు గ్రామాల్ని ఊడ్చేసి, వేలమంది నిర్వాసితుల్ని పట్టించుకోకుండా ఎత్తయిన పటేల్ విగ్రహం స్థాపించినంత మాత్రాన, అది ఈ దేశంలో తొలి ప్రధాని స్థానాన్ని తగ్గించగలదా? ఎవరెన్ని చెప్పినా పటేల్ నెహ్రూ దగ్గర పనిచేసిన హోం మినిస్టర్ మాత్రమే! దార్శనికునిగా, వైజ్ఞానిక ద్రష్టగా పటేల్‌ను ఎవరూ గుర్తుపెట్టుకోలేదు. అయినా ప్రజలు ప్రేమతో, గౌరవంతో తాము ఏర్పాటు చేసుకున్న విగ్రహాల ఎత్తుముందు, జనాన్ని హింసించి, ప్రభుత్వాలు నెలకొల్పే విగ్రహాల ఎత్తెంత? ఆలోచిస్తే విషయం చాలా లోతైంది. స్వాతంత్ర్య సమరంలో తలమునకలై ఉన్న నెహ్రూకు కూతురు ఇందిరను పెంచడం చాలా కష్టమైంది. ఎందుకంటే ఆయన భార్య కమల యవ్వన దశలోనే కన్ను మూశారు. జైలు నుండి ఆయన కూతురికి ఉత్తరాలు రాశారు. అందులో దేశ భూ, భౌతిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల గూర్చి అనేక విషయాలు రాశారు. ఆ ఉత్తరాలే "డిస్కవరీ ఆఫ్ ఇండియా" గా పుస్తకం వెలువడింది. దాని ఆధారంగా చిత్ర దర్శకుడు శ్యాం బెనెగల్ టి.వి. సీరియల్ తీశారు. పిల్లలపై ఆయనకుగల ప్రత్యేకమైనశ్రద్ధ, ప్రేమలవల్లఎన్నో సంస్థలకు, ప్రాజెక్టులకు ఆయన రూపుదిద్దారు. చాచా నెహ్రూగా శాశ్వతత్వం పొందారు.

సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్

జైపూర్ 'టిండర్' హత్య కేసులో
ముగ్గురికి జీవిత ఖైదు

జైపూర్ : ఐదేళ్ల క్రితం డేటింగ్ యాప్ టిండర్‌లో పరిచయమైన నిందితుల్లో ఒకరు 28 ఏళ్ల వ్యాపారవేత్తను హత్య చేసినందుకు జైపూర్‌లోని కోర్టు శుక్రవారం ముగ్గురికి శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ వాస్తవాలను ధ్రువీకరించడానికి తగిన సాక్ష్యాలను సమర్పించిందని సెషన్స్ జడ్జి అజిత్ కుమార్ హింగం శుక్రవారం తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రధాన నిందితురాలు ప్రియా సేథ్ (27) టిండెర్‌లో దుష్యంత్ శర్మతో స్నేహం చేసింది. తరువాత అతన్ని అద్దె నివాసానికి పిలిచింది. అక్కడ ఆమె, ఆమె ఇద్దరు సహచరులు దిష్కాంత్ కమ్రా, లక్ష్య వాలియా అతన్ని బందీగా ఉంచారు. అయితే దుష్యంత్ శర్మను తిరిగి అప్పగించేందుకు డబ్బు చెల్లించడంలో దుష్యంత్ కుటుంబం విఫలమవడంతో నిందితులు అతనిని అనేకసార్లు పొడిచి, దిండుతో ఉక్కిరిబిక్కిరి చేసి హత్య చేశారని ప్రాసిక్యూషన్ న్యాయవాది సందీప్ లోహరియా శనివారం తెలిపారు. 'ప్రాసిక్యూషన్ ఈ వాస్తవాలను ధ్రువీకరించడానికి తగిన సాక్ష్యాలను సమర్పించింది. ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలు నిందితులు నేరానికి పాల్పడ్డారని రుజువు చేశాయి' అని న్యాయమూర్తిని ఉటంకిస్తూ సందీప్ లోహరియా తెలిపారు. సాక్ష్యం ఆధారంగా భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్లు 342 (తప్పుగా నిర్బంధించడం), 302 (హత్య), 201 (నేరం సాక్ష్యం అదృశ్యం కావడం), 120-బి (నేరపూరిత కుట్ర) కింద ముగ్గురు నిందితులను కోర్టు దోషులుగా నిర్ధారించి వారికి శిక్ష విధించింది. జీవిత ఖైదు, అతను చెప్పాడు. శర్మ ఫిబ్రవరి 2018లో ఆన్‌లైన్‌లో సేథ్‌ను కలిశారు. మే 2018లో సేథ్, ఆమె సహచరులు శర్మ కుటుంబం నుంచి డబ్బు డిమాండ్ చేయాలని ప్రణాళిక చేశారు. వారు శర్మ తండ్రి నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. బాధితురాలి తండ్రి తన కుమారుడి ఖాతాలో రూ.3 లక్షలు డిపాజిట్ చేసిన తర్వాత, నిందితుడు జైపూర్‌లోని నెహ్రూ ఉద్యాన సమీపంలోని ఏటీఎం నుంచి రూ.20 వేలు డ్రా చేయడానికి శర్మ డెబిట్ కార్డ్‌ను ఉపయోగించాడు. తమ నేరం వెలుగులోకి వస్తుందనే భయంతో నిందితులు శర్మను హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా చేసి సూట్‌కేస్‌లో నింపి దిల్లీలో రోడ్డుపై పడేశారు. సేథ్, కమ్రాకు నేర చరిత్ర ఉంది. 2014, 2016, 2017లో ఏటీఎం మెషీన్‌ను పగలగొట్టినందుకు ఆమె మూడుసార్లు అరెస్టయింది. కమ్రాను ముంబైలో ఒకసారి అరెస్టు చేశారు.

హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా వరి సేకరణ

ఉనా : హిమాచల్ ప్రదేశ్‌లో వరి సేకరణ గత ఏడాది కొనుగోలును అధిగమించి ఈ ఏడాది 20,993 మెట్రిక్ టన్నులకు చేరుకుందని అధికారులు శనివారం తెలిపారు. గత ఏడాది (2022) 14 వేల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలుతో పోల్చితే, ప్రస్తుత సంవత్సరం (2023) రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 14 మార్కెట్లలో 3,663 మంది రైతుల నుంచి సుమారు 20,993 మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసినట్లు అధికారులు వివరించారు. ఈ ఏడాది 22 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు రాష్ట్ర రైతులు రూ.45 కోట్ల విలువైన 20,993 మెట్రిక్ టన్నుల వరిని ప్రభుత్వానికి విక్రయించారని రాష్ట్ర పౌర, ఆహార సరఫరా సంస్థ జాయింట్ డైరెక్టర్ రవీంద్ర ఠాకూర్ తెలిపారు. సిర్మౌర్ జిల్లాలో 6,250 మెట్రిక్ టన్నుల (62,500 క్వింటాళ్లు) కొనుగోలు లక్ష్యానికి గాను, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఇప్పటికే 9 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని ఆయన అన్నారు. 2022లో దక్షిణ వరి నల్ల-చారల మరగుజ్జు వైరస్ (ఎస్ఆర్‌బీఎస్‌డీవీ) కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పంటలు నాశనమయ్యాయి. చాలా మంది రైతులు వాటిపై ట్రాక్టర్లను నడుపుతూ తమ పంటలను నాశనం చేయాల్సి వచ్చింది. మరుగుజ్జు వ్యాధి అని కూడా పిలువబడే ఎస్ఆర్‌బీఎస్‌డీవీ సిర్మౌర్ జిల్లాలో పంటలను దెబ్బతీసింది. సిర్మౌర్ జిల్లాలో 2 వేల మెట్రిక్ టన్నుల పంట మాత్రమే ఉత్పత్తి అయ్యింది. ఈసారి వర్షాలు బాగా కురియడంతో వైరస్ ప్రభావం నుంచి తప్పించుకోవడంతో రికార్డు స్థాయిలో పంట దిగుబడి వచ్చింది. రాష్ట్ర పౌర, ఆహార సరఫరాల శాఖ ఈసారి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం గమనార్హం. ఇంతకుముందు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) కొనుగోలు చేసింది. రాష్ట్రంలో అక్టోబరు 3 నుంచి కొనుగోళ్లు ప్రారంభమై ఇంకా కొనసాగుతున్నాయి. ఏ-గ్రేడ్ రకం వరి క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ వరి క్వింటాల్‌కు రూ.2,183 మద్దతు ధర.

విమానాశ్రయాల విస్తరణ నిలిచిపోవడానికి
కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణం

కేరళ సీఎం విజయన్ ధ్వజం

కోజికోడ్ : ఉత్తర కేరళలో విమానాశ్రయాల అభివృద్ధి నిలిచిపోవడంపై కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కన్నూర్, కరిపూర్ విమానాశ్రయాల్లో అభివృద్ధి జరగలేదని, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే వాటి విస్తరణ నిలిచిపోయిందని విమర్శించారు. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవ కేరళ సదస్సు కార్యక్రమం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విమానాశ్రయాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, వాటి పూర్తి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలన్న ప్రజల డిమాండ్‌ను నొక్కి చెప్పారు. కేరళ ప్రవాసుల భూమి అని పేర్కొంటూ, వారి స్వదేశంతో అనుసంధానం అయ్యేలా సౌకర్యాలు కల్పించడం విశేషమన్నారు. ప్రవాసులు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ప్రయాణానికి సంబంధించినది ఒకటని ఆయన అన్నారు. 'తరచుగా పెరుగుతున్న విమాన చార్జీలు, వివిధ స్థాయిలలో వారికి ప్రత్యామ్నాయ ప్రయాణ ఎంపికలు లేకపోవడం గురించి మేము చర్చిస్తున్నాము' అని విజయన్ తెలిపారు. ఈ ఆందోళనలను పరిష్కరించడంలో కరిపూర్, కన్నూర్ విమానాశ్రయాల అభివృద్ధి కీలకమని చెప్పారు. మలబార్ (ఉత్తర కేరళ) ప్రాంతానికి రెక్కలు వచ్చిన తొలి విమానాశ్రయంగా నిలిచిన కరిపూర్ విమానాశ్రయం అభివృద్ధి ప్రస్తుతం నిలిచిపోయిందని ముఖ్యమంత్రి అన్నారు. రన్‌వే అభివృద్ధికి అవసరమైన భూమిని అక్టోబరులో ఎయిర్‌పోర్ట్ అథారిటీకి అప్పగించినప్పటికీ, టెండర్ల ప్రక్రియను పొడిగించడం వల్ల జాప్యం జరుగుతోందని విజయన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి రన్‌వే అభివృద్ధిని సాకారం చేయాలని డిమాండ్ చేశారు. గత ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ హయాంలో కన్నూర్ విమానాశ్రయం నిర్మాణం పూర్తయి, అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ అక్కడ విదేశీ విమానయాన సంస్థల నిర్వహణకు కేంద్రం 'పాయింట్ ఆఫ్ కాల్' అనుమతించలేదని సీఎం అన్నారు. విమానాశ్రయాలపై నియంత్రణ సాధించేందుకు, విమాన చార్జీలను తమ ఇష్టానుసారం నిర్ణయించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు సౌకర్యాలు కల్పిస్తోందని విమర్శించారు. ఈ విధానంలో భాగంగానే కన్నూర్ విమానాశ్రయ అభివృద్ధిని అడ్డుకున్నారని ఆయన తెలిపారు.

డీఎల్‌ఎఫ్ కార్యాలయాల్లో ఈడీ తనిఖీలు

న్యూదిల్లీ: రియల్ ఎస్టేట్ సంస్థ సూపర్‌టెక్, దాని ప్రమోటర్లపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా గురుగ్రామ్‌లోని రియాల్టీ మేజర్ డీఎల్‌ఎఫ్ ఆవరణలో ఈడీ సోదాలు చేసినట్లు అధికార వర్గాలు శనివారం తెలిపాయి. రెండు రోజులుగా ఈడీ సోదాలు కొనసాగించిందని, కొన్ని కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నాయి. సూపర్‌టెక్‌పై ఈడీ దర్యాప్తులో భాగంగా సోదాలు నిర్వహించినట్లు వెల్లడించాయి. దీనిపై డీఎల్‌ఎఫ్ వివరణ కోరగా సమాధానం చెప్పడానికి ఆ సంస్థ సుముఖత వ్యక్తంచేయలేదు. అయితే, ఇతర పార్టీలకు సంబంధించిన కార్యాలయాలలో సోదాలు జరిగాయని, డీఎల్‌ఎఫ్‌కు సంబంధం లేదని కంపెనీ వర్గాలు వివరించాయి. కంపెనీ లావాదేవీలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేయాలని ఈడీ అధికారులు కోరారని కంపెనీ వర్గాలు చెప్పాయి. ఈ కేసులో సూపర్‌టెక్ ప్రమోటర్ ఆర్‌కే లేదా రామ్‌కిషోర్ అరోరాను ఈడీ జూన్‌లో అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. వివిధ షెల్ కంపెనీల ద్వారా పెట్టుబడిదారులు, ఇళ్ల కొనుగోలుదారులకు సంబంధించిన కోట్లాది రూపాయలు దారిమళ్లించే గ్రూపును అరోరా నియంత్రణ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

చొక్కా పట్టుకుని లాక్కెళ్లి...
కాళ్లతో తొక్కిపడేసి...

ఎన్నికల వేళ కరీంనగర్‌లో మితిమీరుతోన్న గంగుల గ్యాంగ్ అరాచకాలు

విశాలాంధ్ర-హైదరాబాద్ : కరీంనగర్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ గ్యాంగ్ సృష్టిస్తున్న అరాచకంతో జనం అల్లాడిపోతున్నారు. రెండు రోజుల క్రితం ఓ యువకుడు గంగుల గ్యాంగ్ అరాచకానికి బలై ఒక కుటుంబం రోడ్డు మీద పడింది. ఈ సందర్భంగా బాధితుడి భార్య విలపించిన తీరు యావత్ కరీంనగర్ ప్రజలను కలచివేసింది. ఈ సంఘటన జరిగి 24 గంటలు గడవక ముందే గంగుల గ్యాంగ్ కరీంనగర్ జిల్లా రేకుర్తిలో సృష్టించిన అలజడి ప్రజలను కలవరపరిచింది. గంగుల ప్రచారానికి వచ్చిన సందర్భంలో జరిగిన ఘటన అక్కడికి వచ్చిన జనాన్ని అసహనానికి గురిచేసింది. గంగుల కమలాకర్ తన ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్న క్రమంలో ఓ వృద్ధుడు తనకు పెన్షన్ రాలేదంటూ తన వాడుక బాషలో చెప్పేందుకు ప్రయత్నం చేయగా అది గమనించిన గంగుల గ్యాంగ్ సదరు వ్యక్తిని నోరు తెరవకుండా అతని చొక్కా పట్టుకుని బయటకు లాక్కెళ్లి తొక్కిపడేశారు. అక్కడే మీటింగ్ కవరేజికి వచ్చిన ఓ మీడియా ప్రతినిధి ఈ సన్నివేశాన్ని గమనించి చిత్రీకరించేందుకు ప్రయత్నం చేయగా జర్నలిస్టును సైతం చితకబాది ఫోన్ లాక్కెళ్లడంతో కరీంనగర్‌లో గంగుల గ్యాంగ్ అరాచకం పరాకాష్టకు చేరింది. గత వారం రోజుల్లో గంగుల గ్యాంగ్ ప్రచారంలో ప్రశ్నిస్తున్న జనాన్ని కవరేజ్‌కి వెళుతున్న జర్నలిస్టులను లక్ష్యంగా చేస్తూ జరుగుతున్న దాడులు కలవరపెడుతుండగా, జనం దుమ్మెత్తి పోస్తున్నారు. గంగుల కమలాకర్ గ్యాంగ్ అరాచకాలపై జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తూ కరీంనగర్ పోలీసు కమిషనర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎన్నికల సమయంలో సంయమనం పాటించాల్సిన ప్రజాప్రతినిధులు జనాన్ని జర్నలిస్టులను రెచ్చగొడుతూ కవ్వింపు చర్యలకు దిగడంపై ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. జర్నలిస్టుల భద్రతా ప్రభుత్వ అధికారులదేనని, ఇప్పటికైనా గంగుల కమలాకర్ తన పద్ధతి మార్చుకుని ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో
సుప్రీంలో అప్పీల్‌కు దిల్లీ ఎల్‌జీ ఆమోదం

న్యూదిల్లీ : 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో ఆరుగురు నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ జులై 10న దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసేందుకు దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా ఆమోదం తెలిపారని అధికారులు శనివారం చెప్పారు. ఈ విషయంలో 'అసలు జాప్యం' కు దిల్లీ ప్రభుత్వ ప్రాసిక్యూషన్ విభాగమని కూడా ఎల్‌జీ సక్సేనా నిందించారని ఎల్‌జీ కార్యాలయ అధికారులు తెలిపారు. జాప్యానికి కారణమైన అధికారులను గుర్తించి జవాబుదారీగా ఉండాలని హోం శాఖను ఆదేశించిన ఎల్‌జీ, ఏడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కోరినట్లు వారు వివరించారు. ఈ కేసు వాయువ్య దిల్లీలోని సరస్వతి విహార్ పోలీస్ స్టేషన్ (ప్రస్తుతం సుభాష్ ప్లేస్) ప్రాంతంలో సిక్కు వ్యతిరేక అల్లర్ల సమయంలో దోపిడీ, అల్లర్లకు సంబంధించినది. ఇందులో ఆరుగురు నిందితులు... హరి లాల్, మంగళ్, ధరంపాల్, ఆజాద్, ఓం ప్రకాశ్, అబ్దుల్ హబీబ్ ఉన్నారు. 'జులై 10, 2023న హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడానికి హోం శాఖ చేసిన ప్రతిపాదనను ఎల్‌జీ ఆమోదించారు. ఇందులో నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ ట్రయల్ కోర్టు తీర్పుపై ప్రభుత్వం చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది' అని అధికారులు తెలిపారు. మార్చి 28, 1995 ట్రయల్ కోర్టు తీర్పుపై అభ్యర్థన దాఖలు చేయడంలో 28 సంవత్సరాల 'అతి ఆలస్యానికి' ఎటువంటి వివరణ లేదని, రాష్ట్రం తీసుకున్న కారణాలు 'న్యాయబద్ధం' కావని హైకోర్టు పేర్కొంది.

ఇదే కేసులో నంగ్లోయ్ పోలీస్ స్టేషన్‌లో నమోదయిన మరో సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో 12 మందిని నిర్దోషులుగా విడుదల చేసినందుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడానికి సక్సేనా గతంలో తన ఆమోదాన్ని మంజూరు చేశారు. ప్రస్తుత కేసులో వ్యాజ్యం కాలక్రమాన్ని పరిశీలించిన తర్వాత, దిల్లీ హైకోర్టులో అభ్యర్థన దాఖలు చేయడానికి డిసెంబరు 2020లో ఆమోదం లభించినప్పటికీ, రెండేళ్లకు పైగా ఆలస్యం తర్వాత 2023లో అభ్యర్థన దాఖలు చేసినట్లు ఎల్‌జీ కార్యాలయ అధికారులు తెలిపారు. 'మానవత్వానికి వ్యతిరేకంగా నేరం' వంటి కేసులను 'సాధారణ పద్ధతిలో' పరిష్కరించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని సక్సేనా పేర్కొన్నారు. ఇలాంటి కేసుల్లో విపరీతమైన జాప్యాన్ని తీవ్రంగా పరిగణించాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. 1984 అల్లర్లకు సంబంధించిన 186 కేసులకు సంబంధించి తదుపరి దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని జనవరి 11, 2018న సుప్రీం కోర్టు ఆదేశించిందని, తక్షణ కేసు ఈ కేసుల్లో భాగమని అధికారులు వివరించారు. కాగా, సిట్ తన నివేదికను ఏప్రిల్ 15, 2019న సమర్పించింది. ప్రస్తుత కేసు సరైన కేసు అని, ఇక్కడ తీర్పు వచ్చిన వెంటనే ప్రాసిక్యూషన్ అభ్యర్థన దాఖలు చేయాలని పేర్కొంది. ఆలస్యానికి క్షమాపణతో కూడిన అభ్యర్థనను దాఖలు చేయవచ్చని కూడా సిఫార్సు చేసినట్లు అధికారులు తెలిపారు.

భూ కబ్జా కేసులో రూ.39 కోట్ల ఆస్తుల జప్తు

న్యూదిల్లీ: గోవాలో అక్రమ భూకబ్జా కేసులో రూ.39 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ శనివారం తెలిపింది. ఫోర్జరీ పత్రాల ద్వారా అక్రమంగా భూ సేకరణకు పాల్పడిన కొంతమందిపై మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈ ఆస్తులు అటాచ్ చేసినట్లు వెల్లడించింది. మనీలాండరింగ్ నియంత్రణ చట్టంలోని నిబంధన కింద రూ.39.24 కోట్ల విలువైన ఆస్తులు అటాచ్ చేసినట్లు ఈడీ ఓ ప్రకటనలో పేర్కొంది. గోవాలో అక్రమంగా భూ కబ్జాలకు పాల్పడినట్లు విక్రాంత్ శెట్టి, మొహమ్మద్ సుహైల్, రాజ్‌కుమార్ మైథీ, తదితరులపై మనీలాండరింగ్ కేసు నమోదు చేశారు. నిందితులు అక్రమంగా భూములు ఆక్రమించినట్లు దర్యాప్తులో తేలిందని ఈడీ వెల్లడించింది.

అసెంబ్లీ కమిటీ పదవుల నుంచి కుకీ ఎమ్మెల్యేలకు ఉద్వాసన

ఇంఫాల్: మణిపూర్ అసెంబ్లీకి సంబంధించి వేర్వేరు కమిటీ చైర్మన్ పదవుల నుంచి కుకీ వర్గానికి చెందిన ముగ్గురు శాసనసభ్యులను తొలగించారు. ఈ మేరకు అధికారిక నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్‌గా మయంగ్లంబం రామేశ్వర్‌ను స్పీకర్ నియమించినట్లు అసెంబ్లీ బులెటిన్ తెలిపింది. రామేశ్వర్ నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) ఎమ్మెల్యే. ఇంతకుముందు ఈ కమిటీకి ఎల్ఎం ఖౌతే చైర్మన్‌గా వ్యవహరించారు. ఇండిపెండెంట్ ఎమ్మెల్యే హావోఖోలెట్ కిప్జెన్ చైర్మన్‌గా పనిచేసిన ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్‌గా నాగా పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్) ఎమ్మెల్యేను నియమించారు. బీజేపీ ఎమ్మెల్యే ఉంగ్‌జాగిన్ బాధ్యతలు నిర్వహించిన అసెంబ్లీ లైబ్రరీ కమిటీ చైర్మన్‌గా అదే పార్టీ ఎమ్మెల్యే కె.ఇబోంచను నియమించారు.

ఆస్కార్ నామినేషన్‌కు '12 ఫెయిల్' సినిమా

న్యూదిల్లీ : బాలీవుడ్ ఫిల్మ్ '12 ఫెయిల్' ఆస్కార్స్‌కు పోటీపడనున్నది. ఆ చిత్ర నటుడు విక్రాంత్ మాసే దీనిపై ఓ ప్రకటన చేశారు. ఇండిపెండెంట్ నామినేషన్ కింద '12 ఫెయిల్' సినిమాను ఆస్కార్స్‌కు పంపించినట్లు స్పష్టం చేశారు. మేటి డైరెక్టర్ విదు వినోద్ చోప్రా ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. విక్రాంత్ మాసే ఈ ఫిల్మ్‌లో కీలక పాత్ర పోషించాడు. టీవీ రంగంలో విక్రాంత్ కెరీర్ ప్రారంభమైంది. అతను డ్యాన్సర్ కూడా. విదు వినోద్ చోప్రా తీసిన '12 ఫెయిల్' సినిమాను అక్టోబరు 27న హిందీ, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో విడుదల చేశారు. మనోజ్ పాత్రలో విక్రాంత్ మాసే నటించారు. మేధా శంకర్ హీరోయిన్ పాత్రను పోషించారు. అనురాగ్ పాఠక్ రాసిన నవల ఆధారంగా '12 ఫెయిల్' సినిమాను తీశారు. ఐపీఎస్ ఆఫీసర్ మనోజ్ కుమార్ శర్మ, ఐఆర్ఎస్ ఆఫీసర్ శ్రద్ధా జోష్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

మోదీ పర్యటనలో భద్రతా వైఫల్యం
భటిండా ఎస్పీపై సస్పెన్షన్ వేటు

చండీగఢ్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2022 జనవరి 5న పంజాబ్ లో జరిపిన పర్యటనలో భద్రతా లోపం కల్పించారని ఆరోపిస్తూ ఎస్పీ గుర్విందర్ సింగ్ సంఘాను సస్పెండ్ చేశారు. పంజాబ్ హోం మంత్రిత్వ శాఖ శనివారంనాడు ఈ విషయం తెలిపింది. ఫెరోజ్‌పూర్‌లో ఎస్పీ ఆపరేషన్స్ కోసం నియమించిన గుర్విందర్ సింగ్ విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరోపణలపై ఈ చర్య తీసుకున్నట్టు వెల్లడించింది. 2022 జనవరి 5న ప్రధానమంత్రి ఫిరోజ్‌పూర్ నుంచి హుస్సైనివాలా వెళ్తుండగా భద్రతా లోపం తలెత్తింది. ఉదయం 5 గంటలకు భటిండా చేరిన ప్రధాని అక్కడి నుంచి హుస్సైనివాలాలోని జాతీయ అమరవీరుల స్మారకం వద్దకు హెలికాప్టర్‌లో వెళ్లాల్సి ఉంది. వాతావరణం అనుకూలించకపోవడంతో రోడ్డు మార్గంలో మోదీ ప్రయాణించారు. అమరవీరుల స్మారకానికి 30 కిలోమీటర్ల దూరంలో ఒక ఫ్లై ఓవర్ దగ్గరకు ఆయన కాన్వాయ్ వచ్చేసరికి కొందరు ఆందోళనకారులు రోడ్లను దిగ్బంధించారు. దీంతో ఫ్లై ఓవర్ పైనే ప్రధాని 15 నుంచి 20 నిమిషాల పాటు ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆయన ముందుగా అనుకున్న కార్యక్రమానికి, ర్యాలీకి హాజరుకాకుండానే పంజాబ్ నుంచి వెనక్కి తిరిగి వచ్చేశారు. 2022 జనవరిలో కాంగ్రెస్ నేత చరణ్‌జిత్ సింగ్ చన్ని పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ప్రధాని పర్యటనలో జరిగిన భద్రతా వైఫల్యంపై అనేక మంది రాష్ట్ర అధికారులను సుప్రీంకోర్టు నియామక కమిటీ తప్పుపట్టింది. 22 నెలల అనంతరం దీనిపై పంజాబ్ ప్రభుత్వం చర్య తీసుకుంటూ భటిండా ఎస్పీని సస్పెండ్ చేసింది.

జమ్ముకశ్మీర్‌లోకి
విదేశీ ఉగ్రవాదులను నెట్టేందుకు పాక్ ప్రయత్నాలు

ఉత్తర సైనిక కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది



జమ్ము : జమ్ముకశ్మీర్‌లోకి విదేశీ ఉగ్రవాదులను నెట్టేందుకు పాకిస్తాన్ ప్రయత్నాలు చేస్తోందని ఉత్తర సైనిక కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం అన్నారు. తీవ్రవాద శ్రేణిలో ఆ దేశ రిటైర్డ్ సైనికులు ఉన్నారన్న విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. బుధ, గురువారాల్లో రాజౌరి జిల్లా ధర్మసాల్ బెల్ట్‌లోని బాజిమాల్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదులతో జరిపిన కాల్పుల్లో అమరులైన ఇద్దరు కెప్టెన్లు సహా ఐదుగురు సైనిక జవాన్లకు నివాళులు అర్పించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌లో అఫ్గానిస్తాన్‌లో శిక్షణ పొందిన పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తొయిబా ప్రధాన కమాండర్ క్వారీతో సహా ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా దళాలు హతమార్చాయి. లెఫ్టినెంట్ జనరల్ విలేకరులతో మాట్లాడుతూ సరిహద్దు జిల్లాలైన రాజౌరీ, పూంచ్‌లో ఏడాదిలోపు రెండు డజన్ల మందికి పైగా విదేశీ ఉగ్రవాదులను నిర్మూలించడానికి కార్యకలాపాలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. ఇద్దరు భయంకరమైన విదేశీ ఉగ్రవాదులను హతమార్చడం ఈ ప్రాంతాన్ని అస్థిరపరిచే పాకిస్తాన్ ప్రణాళికలకు పెద్ద ఎదురుదెబ్బ అని సైనిక కమాండర్ అన్నారు. ఉగ్రవాద ర్యాంకుల్లో పాకిస్తాన్‌కు చెందిన కొంతమంది ప్రత్యేక దళాల సిబ్బంది ఉన్నారా అడిగినప్పుడు లెఫ్టినెంట్ జనరల్ మాట్లాడుతూ 'మేము ఉగ్రవాదులను గుర్తించడానికి ప్రయత్నించినప్పుడు, వారిలో కొందరు రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది (పాకిస్తాన్) అని మాకు తెలిసింది' అని చెప్పారు. 'పాకిస్తాన్ స్థానిక జనాభా నుంచి మద్దతు లేకపోవడం, ముఖ్యంగా ఉగ్రవాద ర్యాంకుల్లో నియమితులు కావడానికి యువత ఇష్టపడకపోవడంతో విదేశీ ఉగ్రవాదులను ఈ ప్రాంతంలోకి నెట్టడానికి ప్రయత్నిస్తోంది. విదేశీ ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి మా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి' అని లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది చెప్పారు. లోక్‌సభ ఎన్నికలతో సహా రాబోయే ఎన్నికలకు అంతరాయం కలిగించడానికి పాకిస్తాన్ రాబోయే నెలల్లో మరింత మంది ఉగ్రవాదులను భారత్‌లోకి చొరబాటు చేయాలని భావిస్తుందా అని అడిగిన ప్రశ్నకు, అధికారి స్పందిస్తూ, వివరాల జోలికి వెళ్లకుండా సానుకూలంగా సమాధానం ఇచ్చారు. పిర్ పంజాల్‌కు దక్షిణాన చురుకైన ఉగ్రవాదుల సంఖ్యపై, ఆయన మాట్లాడుతూ రాజౌరీ-పూంచ్ బెల్ట్‌లో ఉగ్రవాదుల సంఖ్య జాతీయ రహదారితో అనుసంధానించబడినందున హెచ్చుతగ్గులకు లోనవుతున్నట్లు చెప్పారు. 'దాదాపు 20 నుంచి 25 మంది ఉగ్రవాదులు ఈ ప్రాంతంలో కార్యకలాపాలు సాగించే అవకాశం ఉంది. అయితే సైన్యం, పోలీసులు, ఇతర గూఢచార సంస్థలు తమ కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. మేము ఒక సంవత్సరంలో పరిస్థితిని నియంత్రించగలము' అని లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది చెప్పారు. బాజిమాల్ ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదుల హత్యలను ప్రస్తావిస్తూ, 'ఉగ్రవాదుల హత్య ఈ ప్రాంతాన్ని కలవరపెట్టడానికి పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలను తీవ్రంగా దెబ్బతీసింది' అని తెలిపారు. ఐదుగురు సైనికుల త్యాగం ఇద్దరు భయంకరమైన ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి దారితీసిందని, ఇది పెద్ద విజయమని ఆయన అన్నారు. 'ఇద్దరు ఉగ్రవాదులు గత ఏడాది కాలంగా చురుకుగా ఉన్నారు. మేము వారిని కనుగొనలేకపోయాము. ఎవరో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, సమాచారాన్ని కూడా అందిస్తున్నారు' అని అన్నారు. ఐదుగురు సైనిక సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన కంది వద్ద భద్రతా బలగాలపై దాడులకు సూత్రధారిగా వ్యవహరించడమే కాకుండా ధంగ్రీలో, రాజౌరి పట్టణంలోని టీసీపీలో జరిగిన 10 మంది పౌర హత్యలకు కారణమైన వారిని నిర్వీర్యం చేయడం చాలా ముఖ్యం అని ఆయన అన్నారు. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ సహా అనేక దేశాల్లో వీరు శిక్షణ పొందే అవకాశం ఉందని సైనిక కమాండర్ తెలిపారు. 'వారు అత్యంత శిక్షణ పొందిన విదేశీ ఉగ్రవాదులు. మన వీర సైనికులు వారి భద్రతపై శ్రద్ధ చూపకుండానే ఆపరేషన్‌లోకి ప్రవేశించి ఉగ్రవాదులను నిర్మూలించారు.

దళాలు ప్రశంసనీయమైన పని చేశాయి' అని అన్నారు. బాజిమాల్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన సైనికుల శవపేటికలపై దండలు వేసి నివాళులర్పించిన వారిలో లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది, జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, జమ్ము వైట్ నైట్ కార్ప్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్, లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్, పోలీసు డైరెక్టర్ జనరల్ ఆర్.ఆర్.స్వైన్, అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ (శాంతిభద్రతలు) విజయ్ కుమార్, జమ్ము జోన్‌లోని పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆనంద్ జైన్ ఉన్నారు. రాజౌరిలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో మాతృభూమిని కాపాడుతూ అమరులైన మన సైనిక వీరుల్లో కెప్టెన్ ఎం.వి.ప్రంజల్, కెప్టెన్ శుభమ్ గుప్తా, హవల్దార్ అబ్దుల్ మజీద్, లాన్స్ నాయక్ సంజయ్ బిష్ట్, పారాట్రూపర్ సచిన్ లార్‌లకు నేను నమస్కరిస్తున్నాను. వారి పరాక్రమం, త్యాగం ఎప్పటికీ మరువలేం. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నాను' అని లెఫ్టినెంట్ గవర్నర్ పుష్పాంజలి ఘటించిన తర్వాత 'ఎక్స్' లో పోస్ట్ చేశారు.

కార్మికులకు ప్రమాద బీమా

ప్రధానికి వినయ్ విశ్వం విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఆపదకు అవకాశం ఉన్న, ప్రమాదకరమైన ప్రాంతాల్లో పనిచేసే కార్మికులకు ఉదారంగా ప్రమాదబీమా మొత్తాన్ని ఈ పనులు చేయించే యాజమాన్యాలు తప్పనిసరిగా అమలు చేయడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నాయకుడు వినయ్‌విశ్వం ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ప్రధానికి శనివారం లేఖ రాశారు. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో సంభవించిన ప్రమాద ఘటన, సంబంధిత పరిణామాలు దేశ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

సిల్క్యారా-బార్కోట్ సొరంగం నిర్మాణ దశలో కూలిపోయిన ఘటన అత్యంత తీవ్రమైంది. కూలిన సొరంగం కింద 41 మంది కార్మికులు ఉన్నారు. ఈ ప్రమాదం ప్రజలను విభ్రాంతికి గురిచేసింది. ఇది జరిగి రెండు వారాలు గడిచింది. కార్మికులను కాపాడే పనులు మరికొన్ని రోజులు పట్టవచ్చు. ఈ పరిణామాలు పరిశీలించదగిన కొన్ని సమస్యలను మన దృష్టికి తెచ్చాయి. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు తగినన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. 14 రోజులుగా సొరంగంలోనే చిక్కుకుపోయిన కార్మికులంతా పేద కుటుంబాలకు చెందినవారే. వీరికి సామాజిక భద్రత అత్యల్పం. పేదరికం వల్ల అత్యంత ప్రమాదకర, అభద్రత వాతావరణంలో తప్పనిసరిగా ఇలాంటి పనులు చేయడానికి వస్తున్నారు. సొరంగం కూలిపోయినప్పటికీ మరణాలు లేకపోవటం అదృష్టమే. కుటుంబంలో సంపాదించే వాళ్లు ప్రమాదంలో చనిపోతే ఆయా కుటుంబాలకు జీవన భృతి లేకుండా పోతుంది. అందువల్ల మనకు తెలిసి లేదా తెలియకుండా జరిగే ప్రమాదాలకు కార్మికులు గురికాకుండా వారిని రక్షించటం మన బాధ్యత. అందువల్ల తక్షణం అత్యంత క్లిష్టమైన ప్రమాదకరమైన నిర్మాణాలలో పాల్గొనే కార్మికులకు ఉదారంగా ప్రమాద బీమా మొత్తాలు చెల్లించడానికి యాజమాన్యాలను ఒప్పించి అమలుచేయాలి.

అత్యంత సున్నితమైన హిమాలయ ప్రాంతంలో జరిగే అభివృద్ధి ఎలాంటిదో గమనించాలి. ఇంకా హిమాలయాలు తరుణ దశలోనే ఉన్నాయి. ఉపఖండం మొత్తం హిమాలయాలపైనే ఆధారపడి ఉంది. ప్రకృతి సమతుల్యాన్ని దెబ్బతీస్తే అత్యంత విధ్వంసకర పరిణామాలు చోటుచేసుకోవచ్చు. జోషిమఠ్ పట్టణం కుంగిపోతున్న పరిణామం ఇటీవలే చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రకృతికి హాని జరగకుండా అత్యంత జాగ్రత్తతో ఈ ప్రాంతంలో అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టాలి. హిమాలయ వాతావరణ పరిస్థితులు కార్మికుల భద్రత అంశాలు మీ దృష్టికి వస్తాయని ఆశిస్తున్నానని వినయ్ విశ్వం పేర్కొన్నారు.

ఎల్1కు చేరువలో ఆదిత్య: ఇస్రో చైర్మన్

తిరువనంతపురం: సూర్యున్ని అధ్యయనం చేయడానికి నింగిలోకి వెళ్లిన వ్యోమనౌక ఆదిత్య ఎల్-1ప్రయాణం తుది దశకు చేరుకుందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 7కల్లా ఆదిత్య వ్యోమనౌక ఎల్ 1 పాయింట్ చేరుకునేందుకు అవసరమైన తుది ఏర్పాట్లు పూర్తవుతాయని చెప్పారు. తిరువనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సోమనాథ్ ఆదిత్య ఎల్1 అప్డేట్స్‌ను వెల్లడించారు. 'ఆదిత్య మిషన్ గమ్యాన్ని చేరుకునేందుకు అతి దగ్గరలో ఉంది. ఎల్ 1 పాయింట్‌కు వెళ్లేందుకు తుది ఏర్పాట్లు చేస్తున్నాం' అని సోమనాథ్ తెలిపారు.సెప్టెంబర్ 2న ఆదిత్య ఎల్1 ను శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించారు. 125 రోజుల్లో 15 లక్షల కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఆదిత్య స్పేస్ క్రాఫ్ట్ సూర్యునికి అతి సమీపంలో ఉన్న లాంగ్రేజియన్ పాయింట్(ఎల్-1)ను చేరుకునే లక్ష్యంతో పంపించారు. ఎల్-1పాయింట్ చేరుకున్న తర్వాత అక్కడి నుంచి ఆదిత్య సూర్యుని చిత్రాలు తీసి భూమికి పంపనుంది. ఇవి సూర్యున్ని మరింత లోతుగా అధ్యయనం చేయడంలో ఇస్రోకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

టీవీ జర్నలిస్టు సౌమ్య హంతకులకు జీవితఖైదు

న్యూఢిల్లీ: టీవీ జర్నలిస్టు సౌమ్య విశ్వనాథన్ హత్యకేసులో నలుగురు నిందితులకు స్థానిక కోర్టు శనివారం జీవితఖైదు విధించింది. మరో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. 2008లో సౌమ్య విశ్వనాథన్ హత్య జరిగిన విషయం విదితమే. ఇది చాలా అరుదైన కేసు అని, అందువల్ల నిందితులకు మరణశిక్ష విధించాలన్న ప్రాసిక్యూషన్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మాలిక్, అజయ్ కుమార్‌కు జీవిత ఖైదు విధించిన కోర్టు...ఐదో నిందితుడు అజయ్ సేథికి మూడేళ్ల సాధారణ శిక్ష ఖరారు చేసింది. ప్రముఖ ఇంగ్లీష్ వార్త చానెల్‌లో పనిచేస్తున్న సౌమ్య విశ్వనాథన్‌ను 2008 సెప్టెంబరు 30న దక్షిణ ఢిల్లీ నెల్సన్ మండేలా మార్గ్‌లో తెల్లవారుజామున నిందితులు కాల్చి చంపారు. విధులు ముగించుకొని ఇంటికొస్తున్న సమయంలో ఆమెను హత్య చేశారు. దోపిడీ కోసమే సౌమ్యను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఐపీసీ 302, మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం కింద రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మాలిక్, అజయ్ కుమార్‌లను అక్టోబరు 18న కోర్టు దోషులుగా నిర్ధారించింది. ఐపీసీ సెక్షన్ 411 కింద అజయ్ సేథిని దోషిగా పేర్కొంది. సౌమ్య విశ్వనాథన్‌ను రవి కపూర్ నాటు తుపాకీతో కాల్చి చంపాడని, అమిత్ శుక్లా, అజయ్ కుమార్, బల్జీత్ మాలిక్...రవి కపూర్‌తో ఉన్నారని ప్రాసిక్యూషన్ తెలిపింది. హత్యకు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆదాయమే కాదు అప్పు కూడా లక్షల కోట్లు

న్యూఢిల్లీ: భారతదేశంలో అత్యంత సంపన్నుడు ఎవరంటే ముక్తకంఠంతో 'ముఖేష్ అంబానీ' అని చెబుతారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ నడుపుతూ లక్షల కోట్లు ఆర్జిస్తున్న ఆయన అప్పుల్లో కూడా అగ్రగామిగా ఉన్నట్లు నివేదికలు చెబుతు న్నాయి. ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏకంగా రూ.3.13 లక్షల కోట్లు అప్పు చేసినట్లు ఏస్ ఈక్విటీ డేటా ప్రకారం తెలుస్తోంది. ప్రస్తుతం ఎక్కువ అప్పు చేసిన కంపెనీల జాబితాలో రిలయన్స్ ప్రథమ స్థానంలో ఉన్నట్లు సమాచారం. దేశంలోని పెద్ద విద్యుత్ రంగ కంపెనీలలో ఒకటైన 'నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్' రూ. 2.20 లక్షల కోట్ల అప్పుతో ఈ జాబితాలో రెండవ స్థానంలో చేరింది. వోడాఫోన్ ఐడియా అప్పుల గురించి గత కొంత కాలంగా చర్చలు జరుగుతున్నాయి. అయితే దీని అప్పు రిలయన్స్ కంటే తక్కువని తెలుస్తోంది. ఈ కంపెనీ ప్రభుత్వ యాజ మాన్యంలో ఉన్నప్పటికీ అప్పు మాత్రం రూ. 2.01 లక్షల కోట్లని సమాచారం. భారతి ఎయిర్‌టెల్ కూడా దేశంలో ఎక్కువ అప్పు తీసుకున్న కంపెనీలలో ఒకటిగా ఉంది. ఈ సంస్థ మొత్తం అప్పు రూ.1.65 లక్షల కోట్లని తెలుస్తోంది. దేశంలోనే అతిపెద్ద చమురు సంస్థ 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్' రూ.1.40 లక్షల కోట్ల అప్పులను, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ రూ.1.29 లక్షల కోట్ల అప్పుతో ఈ జాబితాలో చేరాయి.

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రుణం రూ. 1.26 లక్షల కోట్లు కాగా, దేశీయ దిగ్గజం టాటా మోటార్స్ అప్పుడు రూ. 1.25 లక్షల కోట్ల వరకు ఉందని స్పష్టమవుతోంది. చంద్రయాన్ మిషన్‌లో కీలక పాత్ర పోషించిన 'లార్సెన్ అండ్ టుబ్రో' సంస్థ మొత్తం అప్పు రూ.1.18 లక్షల కోట్లు. లక్ష కోట్ల కంటే ఎక్కువ అప్పు చేసిన కంపెనీల జాబితాలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ కూడా ఉంది. ఈ కంపెనీ ప్రస్తుత అప్పు రూ.1.01 లక్షల కోట్లు. అయితే ఎక్కువ అప్పు చేసిన కంపెనీల జాబితాలో అదానీ గ్రూప్ లేకపోవడం గమనార్హం.

అధికారులకు మేమే షోకాజ్ నోటీసులిస్తాం

- సకాలంలో వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదు ?
- ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నేతల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సకాలంలో సక్రమంగా జీతాలివ్వని, విధులు నిర్వహించని అధికారులందరికీ ఎందుకు తమ కార్యాలయాల ఎదుట నిరవధిక ఆందోళన నిర్వహించకూడదో తెలపాలని కోరుతూ షోకాజ్ నోటీసులిస్తామని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర కార్యవర్గం స్పష్టం చేసింది. విజయవాడలోని కార్యాలయంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిలలో అధికారులు ఉపాధ్యాయుల పట్ల కక్ష పూరితంగా, షోకాజ్ నోటీసుల పేరుతో వేధింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విచ్చలవిడి బోధనేతర పనులతో టీచర్లను ఒత్తిడికి గురి చేస్తూ, ప్రైవేటు విద్యాసంస్థల్ని ప్రోత్సహిస్తూ, మరో వైపు విద్యా ప్రమాణాల పేరుతో వింత నాటకాలాడుతున్నారని విమర్శించారు. అధికారుల ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురై స్వేచ్ఛగా బోధన చేసే పరిస్థితి లేకపోవడంతో విద్యా ప్రమాణాలు సైతం కుంటుపడుతున్నాయని, దీనికి అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. చాలా జిల్లాల్లో గత ఇరవై సంవత్సరాలుగా టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్, సీనియార్టీ జాబితాలను డీఈఓలు విడుదల చేయలేదన్నారు. నెలవారీ పొదుపు చేసుకున్న టీచర్ల పీఎఫ్ రుణాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందని, పీఎఫ్ మొత్తాలు సక్రమంగా జమ చేయడం లేదని, ఇందుకు జిల్లా పరిషత్ సీఈఓలు బాధ్యత వహించాలన్నారు. వివిధ పనులకు సమయాన్ని నిర్దేశించే అధికారులు, ఒకటో తేదీన వేతనాలు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. దీని వలన ఉద్యోగులు, టీచర్లు, పెన్షనర్లు బ్యాంకుల్లో బకాయిదారులుగా, ఎగవేతదారులుగా ముద్రపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఏ, పీఆర్సీ, ఆర్జిత సెలవు, పదవీ విరమణ బకాయిలు వేల కోట్లల్లో పెండింగ్‌లో వుండడానికి రాష్ట్ర అధికారులు బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ విధంగా టీచర్లను, విద్యార్థులను, విద్యావ్యవస్థను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులకు ఎస్టీయూ తరపున షోకాజ్ నోటీసులను అందిస్తామని, వారిచ్చే సమాధానాల మేరకు ఆందోళనా కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అకాలమరణం పొందిన టీచర్ల కుటుంబ సభ్యులకు గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలకు పరిమితం చేయడం సబబు కాదన్నారు. ఖాళీలున్న ఏ శాఖలోనైనా వారికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వెంటనే డీఎస్సీ ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్ల సమస్యలపై ఇచ్చిన హామీల మేరకు ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ తిమ్మన్న, ఆర్థిక విభాగం కార్యదర్శి ఎం.వీ ఎస్.ఎస్. ప్రసాద్, ఉపాధ్యాయవాణి పత్రికా సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, గంటామోహన్, వై.సుబ్రమణ్యంరాజు, సి.పురుషోత్తం, ఎస్.రామచంద్రయ్య, జాకబ్, సి.నాగరాజు, ఎస్ఎం.సుభాని, కె.కోటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరో 9 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు ఎన్‌ఏబీ అక్రిడిటేషన్

నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ లకు నేషనల్ బోర్డ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) సాధించాలన్న సాంకేతిక విద్యా శాఖ ప్రయత్నాలు సత్ఫలితాలని ఇస్తున్నాయని నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే తొమ్మిది పాలిటెక్నిక్ లలో 17 విభాగాలకు ఎన్‌బీఏ దక్కగా, రాష్ట్రంలోని మరో తొమ్మిది ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు కొత్తగా ఎన్‌బీఏ గుర్తింపు పొందాయని చెప్పారు. అన్ని పాలిటెక్నిక్‌లు ఆ దిశగా విజయం సాధించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని వివరించారు. మొత్తం 16 విభాగాలలో తొమ్మిది పాలిటెక్నిక్‌లకు నూతనంగా నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ నుంచి గుర్తింపు లభించిందని సురేశ్ కుమార్ వివరించారు. పాలిటెక్నిక్ విద్యను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల మేరకు నిర్వహించాలన్న ప్రభుత్వ లక్ష్య సాధన దిశలో ముందడుగు వేస్తున్నామన్నారు. శ్రీకాకుళం, విజయవాడ, కుప్పం, అనకాపల్లి, గన్నవరం, కళ్యాణ దుర్గం, అముదాలవలస, గుంటూరు, నంద్యాల, కలికిరి, పార్వతీపురం, రాజంపేట, కాకినాడ, ధర్మవరం, చంద్రగిరి, ఆత్మకూరు పాలిటెక్నిక్‌లు వేర్వేరు బ్రాంచ్‌లలో ఎన్‌బీఏ గుర్తింపును దక్కించుకున్నాయన్నారు. తొలిదశలో 41 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు ఎన్‌బీఏ కోసం ప్రయత్నించగా, ఇప్పటి వరకు 18 పాలిటెక్నిక్‌లు ఎన్‌బీఏ గుర్తింపు పొందాయని, రాష్ట్రంలో మొత్తం 87 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఉండగా మిగిలిన 46 పాలిటెక్నిక్‌లలో 43 సంస్థలకు 2024-2025 విద్యా సంవత్సరంలో గుర్తింపు వచ్చేలా కార్యాచరణ అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. నూతనంగా మూడు పాలిటెక్నిక్ లు ప్రారంభించగా వాటికి మూడు సంవత్సరాల తర్వాత దరఖాస్తు చేయాల్సి ఉందని, ఎన్‌బీఏ ప్రమాణాలకు అనుగుణంగా పాలిటెక్నిక్‌లను తీర్చి దిద్దటంలో సాంకేతిక విద్యా శాఖ విశేష కృషి చేసిందని చెప్పారు. అక్రిడిటేషన్ ఆవశ్యకతను గుర్తిస్తూ ఆయా సంస్థలలో విప్లవాత్మకమైన మార్పులకు సాంకేతిక విద్యా శాఖ శ్రీకారం చుట్టిందని, వృత్తిపరమైన విద్యా రంగంలో నాణ్యత, ఔచిత్యానికి హామీ ఇచ్చి, అత్యున్నత స్థాయి విశ్వసనీయతను నిర్ధారించడం ధ్యేయంగా అంతర్జాతీయ ప్రమాణాల అక్రిడిటింగ్ ఏజెన్సీగా భారత్ లో ఎన్‌బీఏ వ్యవహరిస్తోందన్నారు. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, రానున్న రెండు నెలల్లో మరో 11 పాలిటెక్నిక్ లకు ఎన్‌బీఏ లభించే అవకాశముందని, ఇందుకు సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు సాధనలో భాగంగా చేస్తున్న కార్యక్రమాలు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు నూతనత్వాన్ని ఆపాదిస్తున్నాయని చెప్పారు. విద్యార్థులకు ఉపాధి ఏ మేరకు లభిస్తుందన్న దానిని ఎన్‌బీఏ పరిగణనలోకి తీసుకుంటుదని, ఆక్రమంలో వారికి తక్షణ ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

తేజస్ యుద్ధ విమానంలో మోదీ విహారం

బెంగళూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తేజస్ యుద్ధవిమానంలో శనివారం విహరించారు. బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌ను మోదీ సందర్శించారు. అక్కడ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌లో ప్రయాణించారు. ఆ ఫొటోలను ప్రధాని తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. తేజస్ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేశానని, ఈ అనుభవం చాలా అద్భుతంగా ఉందని మోదీ పేర్కొన్నారు. ఈ ప్రయాణంతో మన స్వదేశీ సామర్థ్యంపై తనకు విశ్వాసం మరింత పెరిగిందని తెలిపారు. మన దేశ శక్తి సామర్థ్యాల పట్ల తనకు గర్వంగా ఉందని, ఇది మన శాస్త్రవేత్తల కృషి, అంకితభావానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. స్వావలంబనలో మనం ప్రపంచంలో ఎవరి కంటే తక్కువ కాబోమని గర్వంగా చెప్పగలనని మోదీ తెలిపారు. భారత వాయుసేన, డీఆర్‌డీవో, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు హృదయపూర్వక అభినందనలని మోదీ పోస్టులో రాసుకొచ్చారు. హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న తయారీ యూనిట్‌ను ప్రధాని పరిశీలించారు. వైమానికదళం, భారత నావికాదళం వినియోగిస్తున్న తేజస్ ట్విన్ సీట్ ట్రైనర్ వేరియంట్‌లో ప్రధాని ఉత్సాహంగా విహరించారు. ఈ తేలికపాటి యుద్ధ విమానాన్ని తొలుత వాయుసేన కోసం హాల్ రూపొందించింది. ఆ తర్వాత గ్రౌండ్ మారిటైమ్ ఆపరేషన్స్ కోసం నావెల్ వేరియంట్‌ను పరీక్షిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో ప్రధాని మోదీ వాషింగ్టన్ పర్యటన సందర్భంగా... హాల్, అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ (జీఈ) మధ్య కీలక ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. జీఈ ఏరోస్పేస్‌కు చెందిన 414 ఇంజిన్లను హెచ్‌ఏఎల్‌తో కలిసి భారత్‌లో తయారు చేసేందుకు ఒప్పందం కుదిరింది. ఈ ఇంజిన్లను తేజస్ మార్క్-2 యుద్ధవిమానాల్లో అమర్చనున్నారు.

డిసెంబరు 2న అఖిలపక్ష సమావేశం

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ముందు ప్రభుత్వం డిసెంబరు 2న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు శనివారం ఆ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు సమావేశాలు డిసెంబరు 4న ప్రారంభమై డిసెంబరు 22న ముగుస్తాయి. సమావేశాల ప్రారంభానికి ఒక రోజు ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, డిసెంబరు 3న ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఓట్ల లెక్కింపు కారణంగా ఈసారి అది ఒక రోజు ముందుకు జరిగింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు... కీలక బిల్లులను ఆమోదించడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉన్న సమావేశాలపై ప్రధాన ప్రభావం చూపుతుంది. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై 'నగదుకు ప్రశ్నలు' ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ నివేదికను ఈ సమావేశాల్లో లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. కమిటీ సిఫార్సు చేసిన బహిష్కరణ అమలులోకి రాకముందే సభ నివేదికను ఆమోదించాల్సి ఉంటుంది. ఐపీసీ, సీఆర్‌పీసీ, సాక్ష్యాధారాల చట్టం స్థానంలో మూడు కీలక బిల్లులను సమావేశాల్లో పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ఎందుకంటే హోంపై స్టాండింగ్ కమిటీ ఇప్పటికే మూడు నివేదికలను ఇటీవల ఆమోదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన మరో కీలక బిల్లు పార్లమెంటులో పెండింగ్‌లో ఉంది.

రాజస్తాన్‌లో 68 శాతం ఓటింగ్

అనేక చోట్ల హింసాత్మక ఘటనలు

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలలో శనివారం సాయంత్రం 5 గంటల సమయానికి 68 శాతం కంటే ఎక్కువ ఓటింగ్ నమోదయింది. కొన్ని విచ్చలవిడి హింసాత్మక సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రవీణ్ గుప్తా మాట్లాడుతూ పూర్తి వివరాలు అందిన తర్వాత ఓటింగ్ శాతం తుది సంఖ్యను వెల్లడిస్తామని చెప్పారు. గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06 శాతం ఓటింగ్ నమోదయింది. ఈసారి ప్రతి నియోజకవర్గంలో కనీసం 75 శాతం పోలింగ్ జరగాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది. 199 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 51 వేలకు పైగా పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. అయితే ఆ సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు 68.2 శాతం పోలింగ్ నమోదయింది. జైసల్మేర్ జిల్లాలో అత్యధికంగా ఓటింగ్ నమోదు కాగా, ఆ తర్వాతి స్థానాల్లో హనుమాన్‌గఢ్, ధోల్‌పూర్ జిల్లాలు నమోదయ్యాయి' అని పోలింగ్ ముగిసిన తర్వాత గుప్తా విలేకరుల సమావేశంలో అన్నారు. ఎడారి రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య ప్రత్యక్ష పోటీ నెలకొంది. శనివారం ఓటింగ్ ప్రారంభమైన మొదటి రెండు గంటల్లో దాదాపు 10 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల సమయానికి ఈ సంఖ్య దాదాపు 25 శాతానికి, మధ్యాహ్నం 1 గంటకు 40 శాతానికి పైగా పెరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి మృతితో శ్రీగంగానగర్‌లోని కరణ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ వాయిదా పడింది. 199 స్థానాల్లో 5.25 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 1,862 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.

గుండెపోటుతో పోలింగ్ ఏజెంట్, ఓటరు మృతి

సుమేర్‌పూర్ నియోజకవర్గం జోరారం కుమావత్ నుంచి బీజేపీ అభ్యర్థికి పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న శాంతి లాల్, అలాగే, ఉదయ్‌పూర్ జిల్లాలోని పాలిలో 62 ఏళ్ల ఓటరు సత్యేంద్ర అరోరా పోలింగ్ కేంద్రాల్లో గుండెపోటుతో మరణించారు.

అనేక చోట్ల హింసాత్మక ఘటనలు

పోలింగ్ సజావుగా సాగేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1.70 లక్షల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. అయితే, డీగ్ జిల్లాలోని కమాన్‌లోని సాన్వర్ గ్రామంలో రాళ్ల దాడిలో ఒక పోలీసుతో సహా ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. 'గుంపును చెదరగొట్టడానికి పోలీసులు గాలిలోకి 12 రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ ఘటన కారణంగా కొన్ని నిమిషాల పాటు ఓటింగ్‌కు అంతరాయం కలిగింది' అని డీగ్ పోలీస్ సూపరింటెండెంట్ బ్రిజేష్ ఉపాధ్యాయ్ తెలిపారు. సికార్‌లోని ఫతేపూర్‌లో రెండు గ్రూపులు ఘర్షణ పడ్డారు. హింసలో ఒక జవాన్ గాయపడ్డాడు. పోలింగ్ కేంద్రం వెలుపల రాళ్ల దాడి జరిగింది. రాళ్ల దాడిలో ఒక జవాన్ గాయపడ్డాడు. పౌరులెవరూ గాయపడలేదు. దాదాపు ఐదు నుంచి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఫతేపూర్ డీఎస్పీ రామ్ ప్రతాప్ తెలిపారు. ధోల్‌పూర్‌లోని బారీ సీటులోని పోలింగ్ కేంద్రం వెలుపల ఒక పోలింగ్ ఏజెంట్, ఒక వ్యక్తి మధ్య వాగ్వాదం జరిగింది. తరువాత జరిగిన హింసలో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. కొంత సేపటికి పోలింగ్ నిలిపివేసి, ఆ తర్వాత పునః ప్రారంభించామని ధోల్పూర్ కలెక్టర్ అనిల్ కుమార్ అగర్వాల్ తెలిపారు. టోంక్ జిల్లాలోని ఉనియారాలో 40 నుంచి 50 మంది పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు ఎస్పీ రాజర్షి రాజ్ తెలిపారు. ఘర్షణలు జరిగిన కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలనే నిర్ణయంపై ప్రశ్నించగా... పరిశీలకుల నివేదిక వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల ప్రధాన అధికారి తెలిపారు. ఎక్కడా ఓటింగ్ ప్రక్రియ ఆగిపోయినట్లు ఎలాంటి నివేదిక రాలేదని గుప్తా తెలిపారు. యువకులు, వృద్ధులు సహా అనేక మంది ఓటర్లు ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారని ఆయన వివరించారు. ఇది ప్రజాస్వామ్య పండుగ అని, అందరూ ఇందులో పాల్గొనాలని మరో ఓటరు జై సింగ్ అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి, ఓటు వేసిన తర్వాత ప్రజలు, ముఖ్యంగా యువ ఓటర్లు సెల్ఫీలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కైలాష్ చౌదరి, మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ తమ ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో మొదటివారు.

మోదీకి ఫొటోల పిచ్చి: జైరాం



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీకి ఫొటోల పిచ్చిపట్టిందని కాంగ్రెస్ విమర్శించింది. తేజాస్ యుద్ధవిమానంలో శనివారం ప్రయాణించిన మోదీ...ఆ ఫొటోలను సామాజిక మాధ్యమం వేదికగా షేర్ చేశారు. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించారు. తేజాస్ యుద్ధవిమానంలో పర్యటించిన మోదీ...భారతదేశ స్వదేశీ సామర్థ్యపై తనకు విశ్వాసం కలిగినట్లు పేర్కొన్నారు. మన స్వదేశీ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి తేజాస్ తేలికపాటి యుద్ధవిమానాలు నిదర్శనమని, అయితే, వీటి తయారీ దశాబ్దాలుగా కొనసాగుతోందని, మోదీ వచ్చిన తర్వాత తేజాస్ యుద్ధవిమానాలపై నిర్ణయం తీసుకోలేదని జైరాం రమేశ్ స్పష్టంచేశారు. తేజాస్‌ను ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ) అభివృద్ధి చేసిందని, ఇది 1984లోనే ఏర్పడిందని గుర్తుచేశారు. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), నేషనల్ ఏరోస్పేస్ లేబరేటరీస్(ఎన్ఏఎల్), భారత వైమానిక దళం, నావికాదళం భాగస్వామ్యం ఇందులో ఉందని కేంద్రమాజీ మంత్రి కూడా అయిన జైరాం రమేశ్ వివరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.